

V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
21-08-2026
RNI No : TGTEL/25/A1676
సంపుటి : 02 | సంచిక : 39 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# ఇకపై బుజ్జగింపు రాజకీయాలు పనిచేయవు

- వందేమాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరిపై అమిత్ షా ఫైర్
- వందేమాతరం తొలి రెండు చరణాలనే ఆలపించాలని సీడబ్ల్యూసీ నిర్ణయం
- ఈ నిర్ణయం దేశ విభజనకు దోహదపడిన ఒక చారిత్రక తప్పిదాన్ని పునరావృతం చేయడమే
- కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ విస్మరించాలని నిర్ణయించుకుంది
- 'వందేమాతరం' అంటూ ప్రాణత్యాగం చేసిన లక్షలాది మంది వీరులను అవమానిస్తోంది
- దేశ ప్రజలు ఈ నిర్ణయంపై గళం విప్పాలని అమిత్ షా పిలుపు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: జాతీయ గీతం వందేమాతం విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. వందేమాతరం తొలి రెండు చరణాలనే ఆలపించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆ పార్టీ మరోసారి బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయం దేశ విభజనకు దోహదపడిన ఒక చారిత్రక తప్పిదాన్ని పునరావృతం చేయడమేనని ఆరోపించారు. గురువారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

' కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ బుధవారం ఒక అనూహ్యమైన, దేశ వ్యతిరకే నిర్ణయం తీసుకుంది. వందేమాతం గీతంలోని కేవలం రెండు చరణాలే పాడాలని వారు నిర్ణయించారు. ఇది 1937లో ముస్లింలను బుజ్జగించడం కోసం వందేమాతరం గేయాన్ని రెండుగా విడగొట్టి దేశ విభజనకు పునాది వేసిందనే విషయాన్ని నేను గుర్తు చేయాలని అనుకుంటున్నా. అప్పటి నుంచే ద్విజాతి సిద్ధాంతం బలపడింది. అదే చివరికి దేశ విభజనకు దారితీసింది. దీంతో పాకిస్థాన్ ఉద్భవించింది. ప్రస్తుతం మోడీ సర్కార్? కాంగ్రెస్? చేసిన ఆ చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దింది. వందేమాతర గేయాన్ని పూర్తిగా ఆలపించడం ద్వారా జాతీయ సమైక్యతను బలోపేతడం చేయడానికి ప్రయత్నించింది. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో దీనిని పూర్తిగా ఆలపించాలన్న నిర్ణయానికి చట్టరూపంలోకి తీసుకొచ్చారు' అని అమిత్? షా తెలిపారు.

### కాంగ్రెస్ చేసిన తప్పును మోడీ సర్కార్ సరిదిద్దింది..

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్? విస్మరించాలని నిర్ణయించుకుందని అమిత్? షా విమర్శించారు. కాంగ్రెస్? తీసుకున్న ఈ నిర్ణయం వారి తీవ్ర బుజ్జగింపు రాజకీయ విధానాన్ని ధ్రువీకరిస్తోందని అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారు వందేమాతరాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీని మాత్రమే కాకుండా, స్వాతంత్ర్య పోరాటంలో 'వందేమాతరం' అంటూ ప్రాణత్యాగం చేసిన లక్షలాది మంది వీరులను కాంగ్రెస్ అవమానిస్తోందని విమర్శించారు. వందేమాతరం

2లో

## నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు

భూ సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యం

హైదరాబాద్ పరిసరాల్లోని జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహణ

దూర ప్రాంత జిల్లాలకు స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్న మంత్రి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా.. క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశించే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ పరిసరాల్లోని జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్నారు. దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహిస్తారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లతో సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆ ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను

2లో

## త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టడంలో తప్పు లేదు

- అమలు సముచితంగా జరగేలా చూసుకోవాలి
- పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడకూడదు
- విద్యార్థులకు ఉన్న సమస్యలలో కొన్నింటిని పునఃపరిశీలించాలి
- అమలులో ఆటంకాలు, సమస్యలకు పరిష్కారం కనుక్కోవడంపై దృష్టి సారించాలి
- ప్రాంతీయ భాషల పట్ల మనకు ఎలాంటి న్యూనతా భావం ఉండకూడదు
- త్రిభాష బోధన కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండాలి
- సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విధానం వల్ల పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడకూడదని పేర్కొంది. 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించడాన్ని తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ తీసుకొచ్చిన విధానం వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టడంలో తప్పు లేదని, అయితే దానిని అమలు చేస్తున్న తీరుపైనే పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహానాలతో కూడిన సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది."త్రిభాషా విధానంపై విద్యార్థులకు ఉన్న సమస్యలలో కొన్నింటిని పునఃపరిశీలించాలి. ఎప్పటికైనా త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టాల్సిందేనన్న




విషయంలో ఎలాంటి సందేహం లేదు. అందులో తప్పు కూడా ఏమీ లేదు. కానీ త్రిభాషా విధానం అమలులో ఎదురవుతున్న ఆటంకాలు, సమస్యలకు పరిష్కారం కనుక్కోవడంపై దృష్టి సారించాలి. అందుబాటులో ఉన్న భాషా ఎంపికలకు సంబంధించి తగిన మానవ వనరుల వ్యవస్థను ఎలా నిర్మించాలనేది పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలలో ఒకటి. ఒకవేళ ఆరో తరగతిని త్రిభాషా విధానానికి ప్రారంభ

2లో

## ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ

- నీట్ నిరసనలవేళ పోలీసుల చర్యలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నసుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాశ్ రెడ్డి



విశ్వంభర, నేషనల్ బ్యూరో: నీట్ పేపర్? లీకేజీ వ్యవహారానికి వ్యతిరేకంగా చలో పార్లమెంట్ చేపట్టిన ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్ జాయమాల్య బాగ్చి, జస్టిస్? వి.మోహనతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాశ్ రెడ్డి ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. ఆయనతో పాటు పంజాబ్–హరియాణా హైకోర్టు

2లో

## సమన్వయం, సాంకేతికత పరిజ్ఞానానిదే కీలక పాత్ర..



- వివిధ విభాగాల మధ్య సమన్వయం, డిజిటల్ వేదికలతో బాధితులకు సత్వర న్యాయం
- ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా ఉండాలి
- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: నూతన క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం (బీఎస్ఏ) అమలులో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగంతో పాటు వివిధ విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "న్యూ క్రిమినల్ లాస్: స్ట్రెంగ్తెనింగ్ ద క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ త్రూ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్" అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చొరవతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయాధికారులు, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అధికారులు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు.

### సమన్వయం, సాంకేతికతదే కీలక పాత్ర..

సదస్సును ప్రారంభించిన తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ఒక క్రిమినల్ కేసు అనేది ఎఫ్ఐఆర్ నమోదుతో ప్రారంభమై, దర్యాప్తు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్ మీదుగా న్యాయస్థాన తీర్పు వరకు సాగుతుందని ఇందులో ప్రతి విభాగానికి కీలక పాత్ర ఉంటుందన్నారు. బాధితులకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయం అందించేందుకు ఈ వ్యవస్థల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని సూచించారు. కొత్త నేర చట్టాల అమలులో సంస్థల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విభాగం తన బాధ్యతతో పాటు ఇతర విభాగాలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సు ఒక్కసారితో ముగిసిపోకుండా నిరంతర సమన్వయానికి నాంది కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు.

2లో

## ఈసెట్‌తో బీటెక్ ప్రవేశాలు యథాతథం..

- మూడేళ్ల ఏఐసీటీఈ గుర్తింపు పొందిన డిప్లొమా కోర్సు కొనసాగిస్తాం
- రూ.2,000 స్టైపెండ్‌ను పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా వర్తింపజేయనున్నాం
- పాలిటెక్నిక్ లెక్చరర్లు, సిబ్బంది క్యాడర్, ఉద్యోగాల్లో కోత ఉండదు
- రాష్ట్రంలోని ప్రతీ పాలిటెక్నిక్‌లో ప్రత్యేక ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేయనున్నాం
- మంత్రి వివేక్ వెంకటస్వామి
- పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్ వర్సిటీ పరిధిలోకి తీసుకురావడం పట్ల విద్యార్థర్థుల ఆందోళన
- కార్మికమంత్రి వివేక్ వెంకట్ స్వామితో పాలిటెక్నిక్ జేఏసీ భేటీ

2లో

## సదరన్ కౌన్సిల్ భేటీ..

**హాజరైన సీఎంలు చంద్రబాబు, విజయ్**

విశ్వంభర, చెన్నై: కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో తమిళనాడులోని మామల్లపురం (మహాబలిపురం)లో దక్షిణ మండలి (సదరన్ కౌన్సిల్) సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేరళ సీఎం సతీశన్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మిగిలిన ముఖ్యమంత్రులు కలుసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఏపీ సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలు, కేటాయింపులు, ఇతర అంశాలపై చర్చించారు. ప్రధానంగా నీట్ వివాదం, కావేరి జలాలు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ అభ్యంతరాలను దక్షిణాది రాష్ట్రాల సీఎంలు అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు.



## 97 జీవోను వెనక్కి తీసుకోవాలి



- పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నాం
- రేవంత్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయంతో అగమ్యగోచరంగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు
- విద్యార్థుల హక్కులను కాలరాయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి: కేటీఆర్

2లో

## బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మిర్జా ఫఖ్రుల్



- 35 ఏళ్ల తర్వాత జరిగిన తొలి పోటీ అధ్యక్ష ఎన్నికల్లో బీఎన్పీ విజయం
- మిర్జా ఫఖ్రుల్‌కు 255 ఓట్లు రాగా.. ఒలి అహ్మద్‌కు 88 ఓట్లు..
- నేడు దేశ 23వ అధ్యక్షుడిగా ఫఖ్రుల్ ప్రమాణ స్వీకారం

విశ్వంభర, నేషనల్ బ్యూరో: బంగ్లాదేశ్‌లో దాదాపు 35 ఏళ్ల తర్వాత జరిగిన తొలి పోటీ అధ్యక్ష ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సీనియర్ నేత మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగిర్ విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన దేశ 23వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మిర్జా ఫఖ్రుల్‌కు 255 ఓట్లు రాగా.. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు, జమాత్–ఎ–ఇస్లామీ నేతృత్వంలోని 11 పార్టీల ప్రతిపక్ష కూటమి అభ్యర్థి కల్నల్ (రిటైర్డ్) ఒలి అహ్మద్‌కు 88 ఓట్లు లభించాయి. ఈ వివరాలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం నసీర్ ఉద్దీన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో దాదాపు 35 ఏళ్ల తర్వాత జరిగిన తొలి పోటీ అధ్యక్ష ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సీనియర్ నేత మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగిర్ విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన దేశ 23వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మిర్జా ఫఖ్రుల్‌కు 255 ఓట్లు రాగా.. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు, జమాత్–ఎ–ఇస్లామీ నేతృత్వంలోని 11 పార్టీల ప్రతిపక్ష కూటమి అభ్యర్థి కల్నల్ (రిటైర్డ్) ఒలి అహ్మద్‌కు 88 ఓట్లు లభించాయి. ఈ వివరాలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం నసీర్ ఉద్దీన్ వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసేందుకు మొత్తం 349 మంది పార్లమెంట్ సభ్యులు అర్హత కలిగి ఉండగా.. 343 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో ఆరుగురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ పార్లమెంట్ భవనం జాతీయ సంసద్‌లో పోలింగ్ నిర్వహించారు.

2లో

# సమన్వయం, సాంకేతికత పరిజ్ఞానానిదే కీలక పాత్ర..

**ప్రతినెల సమీక్షకు ప్రతిపాదన..**

కొత్త నేర చట్టాల అమలు నిరంతర ప్రక్రియ కావడంతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి నెలా అమలు తీరుపై సమీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా కోరారు. కొత్త నేర చట్టాలు గత చట్టాల స్థానంలో కొత్త నిబంధనలు తీసుకురావడం మాత్రమే కాదని, పౌర కేంద్రిత న్యాయం, శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, కాలపరిమితితో కూడిన ప్రక్రియలకు ప్రాధాన్యం ఇచ్చే సమగ్ర మార్పు అని వివరించారు.దర్యాప్తుపై సమర్థవంతమైన పర్యవేక్షణ, డిజిటల్ సమాచారాన్ని పూర్తి, కచ్చితంగా నమోదు చేయడం, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న అన్ని డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమం మరింత సమగ్ర, సాంకేతిక ఆధారిత, పౌర కేంద్రిత న్యాయవ్యవస్థ నిర్మాణానికి తొలి అడుగుగా నిలిచిందని సదస్సుకు చొరవ చూపిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీకి డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు.

# 97 జీవోను వెనక్కి తీసుకోవాలి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో 97 ను వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. జీవో 97కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల వేలాదిమంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసనను తెలుపుతున్న విద్యార్థుల మీద కొన్ని చోట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన దృశ్యాలు తనను కలచివేశాయని.. విద్యార్థుల హక్కులను కాలరాయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలు నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారని వెల్లడించారు. ఇకముందు కూడా పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి అన్నివిధాలా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఈసెట్‌తో బీటెక్ ప్రవేశాలు యథాతథం..

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతోనే పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. శక్తి శాఖ పరిధిలోని స్కిల్ యూనివర్సిటీలో విలీనమైనప్పటికీ డిప్లొమా ఉత్తీర్ణులైన విద్యార్థులు లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో చేరే విధానం కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఫీజులు పెరగవని హామీ ఇచ్చిన మంత్రి విద్యార్థులకు నెలకు 2వేల రూపాయల స్టైఫండ్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. లెక్చరర్లు, ఉద్యోగుల సర్వీసు నిబంధనల్లోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు.



### ఈసెట్‌తో బీటెక్ ప్రవేశాలు యథాతథం..

పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేసి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టినట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాల కోసమే పాలిటెక్నిక్‌లను ఉపాధి, శిక్షణ కమిషనరేట్ పరిధిలోకి తీసుకొస్తూ జీవో 97 ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన మూడేళ్ల డిప్లొమా కోర్సు యథావిధిగా కొనసాగుతుందని కోర్సు వ్యవధి, గుర్తింపు, స్ట్రక్చర్‌లో ఎలాంటి మార్పు ఉండదన్నారు. ప్రస్తుత ఫీజు యథాతథంగా కొనసాగుతుందని అదనపు ఆర్థిక భారం పడేలా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు ఈసెట్ ద్వారా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం కూడా యథావిధిగా ఉంటుందని మంత్రి చెప్పారు.

ఏటీసీల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నెలకు 2వేల రూపాయల స్టైపెండ్‌ను పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా ఇవ్వనున్నట్లు వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. సీఎం ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్‌కు కూడా పాలిటెక్నిక్ విద్యార్థులు అర్హత పొందనున్నారని చెప్పారు. రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బోర్డును రెండు విభాగాలుగా పునర్వ్యవస్థీకరించనున్నట్లు వెల్లడించారు. పాలిటెక్నిక్ విభాగం ఉపాధి, శిక్షణ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక యూనిట్‌గా పనిచేస్తుందన్నారు.

### పాలిటెక్నిక్ ఉద్యోగులకు మరిన్ని అవకాశాలు..

పాలిటెక్నిక్ లెక్చరర్లు, సిబ్బంది క్యాడర్, ఉద్యోగాల్లో కోత ఉండదని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిపాలనా, బోధనా విభాగాల్లో అదనంగా రిక్రూట్‌మెంట్, ప్రమోషన్ అవకాశాలను కల్పించనున్నట్లు చెప్పారు. దీంతో పాలిటెక్నిక్ ఉద్యోగులకు భవిష్యత్తులో మరిన్ని ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పాలిటెక్నిక్ ఉద్యోగుల సర్వీసుకు ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుందని మంత్రి తెలిపారు.

పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని చెప్పారు. పాలిటెక్నిక్ విద్యను పరిశ్రమలతో అనుసంధానం చేయడంలో భాగంగా టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకు 2 వేల 300 కోట్ల రూపాయలతో ఎంవోయూ జరిగిందన్నారు. ప్లేస్‌మెంట్లు, శిక్షణ, అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, కరిక్యులమ్ అప్‌గ్రేడేషన్ కోసం ఇప్పటికే సిస్కో, మైక్రోసాఫ్ట్, మహీంద్రా అండ్ మహీంద్రా, జీఎంఆర్, స్విగ్గీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ వంటి 200కుపైగా పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయని మంత్రి తెలిపారు.

### ప్రతి పాలిటెక్నిక్‌లో ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటు..

రాష్ట్రంలోని ప్రతీ పాలిటెక్నిక్‌లో ప్రత్యేక ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్ అవకాశాలను పెంచనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ సర్టిఫికేషన్లు, క్రెడిట్ ట్రాన్స్‌ఫర్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవకాశాలను కూడా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీకి వివిధ దేశాల భాగస్వామ్యాలు ఉన్నందున పాలిటెక్నిక్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులు కేవలం డిప్లొమా అర్హతకే పరిమితం కాకుండా అంతర్జాతీయ సర్టిఫికేషన్లు, పరిశ్రమ అనుభవం, గ్లోబల్ ప్లేస్‌మెంట్ అవకాశాలను పొందేలా వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు.

### కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు..

తెలంగాణ ప్రభుత్వం విద్యా విధానంలో కొత్తగా తీసుకొచ్చిన 'స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్' (శక్తి) స్కీమ్ పట్ల పాలిటెక్నిక్ విద్యార్థులు తమ నిరసనను తీవ్రతరం చేశారు. వరుసగా మూడో రోజు రాష్ట్రవ్యాప్తంగా డిప్లొమా విద్యార్థులు భారీ ఎత్తున ధర్నా చేపట్టారు. శక్తి స్కీమ్ వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని స్టేట్ హోమ్ ఎదుట దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు నిరసన చేపట్టారు. పాలిటెక్నిక్ కళాశాలను స్కిల్ వర్సిటీలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌లో విద్యార్థులు హైదరాబాద్?-విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ క్రమంలో విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

# ఝార్ఖండ్ నియామక పరీక్షల రద్దు కేసులో ట్విస్ట్

**ప్రభుత్వం నిర్ణయంపై హైకోర్టు స్టే**

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఝార్ఖండ్ పరీక్షల్లో అవకతవకల కేసు కీలక మలుపు తిరిగింది. 11, 13వ జేపీఎస్సీ పరీక్షలు, నియామకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుపై ఝార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. పలు రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్స్, నియామకాలను రద్దు చేస్తూ ఝార్ఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొత్తగా నియమితులైన ఉద్యోగులు న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్ర హైకోర్టు స్టే విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో కొత్తగా ఉద్యోగాలు పొందినవారికి ఊరట లభించింది.

పరీక్షలు అవకతవకలు జరిగాయని విద్యార్థుల నిరసనలు చేసిన నేపథ్యంలో ఝార్ఖండ్ సర్కార్ ఇటీవలే కీలక నిర్ణయం తీసుకుంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జీూజ) నిర్వహించిన 44 నియామక పరీక్షలను రద్దు చేసినట్లు ప్రకటించింది. జేపీఎస్సీ, టీడీపీఎల్ నిర్వహించిన పరీక్షలలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులు, సీఐడీ ప్రభుత్వం ముందు ఉంచిన వాస్తవాల ఆధారంగా ఈ రద్దులు జరిగాయని ప్రభుత్వం తెలిపింది. అలాగే నియామక పరీక్షలలో అవకతవకలను పరిష్కరించడానికి ప్రభుత్వం అనేక చర్యలను ప్రకటించింది. 2014 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షలలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణకు కూడా ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాల్ చేస్తూ కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు ఝార్ఖండ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

### 15రోజుల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని నోటీసులు..

తమ వాదన వినకుండా పరీక్షలు, నియామకాలను ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని పిటిషనర్లు పేర్కొన్నారు. పలువురు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారని, తాజా నిర్ణయంతో తమ ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన అభ్యర్థులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ఇలా అందరినీ ఒకేసారి తొలగించడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. తాము నిబంధనల ప్రకారమే పరీక్షలు రాసి మెరిట్ జాబితాలో ఉద్యోగాలు పొందామని స్పష్టం చేశారు. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఝార్ఖండ్ ప్రభుత్వం నియామక పరీక్షల రద్దుకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించింది. దీనిపై 15 రోజుల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సోరెన్ సర్కార్‌కు నోటీసులు ఇచ్చింది. దీంతో కొత్తగా ఉద్యోగాలు పొందినవారికి బిగ్ రిలీఫ్ లభించింది.

### కోర్టు నిర్ణయాన్ని ప్రభుత్వం అంగీకరిస్తుంది కాంగ్రెస్ నేత ప్రదీప్ యాదవ్

మరోవైపు, జేపీఎస్సీ పరీక్షలు, నియామకాలను రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుపై హైకోర్టు స్టే విధించడంపై ఝార్ఖండ్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేత ప్రదీప్ యాదవ్ స్పందించారు. హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం, తామందరం అంగీకరిస్తామని తెలిపారు. పరీక్షల అవకతవకలపై విచారణ ద్వారా వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయని పేర్కొన్నారు. పరీక్షలలో కొన్ని లోపాలు ఉన్నాయని ప్రాథమికంగా భావించినందుకే ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని చెప్పారు. "కోర్టు ముందు ఉన్న పిటిషన్ల ఆధారంగానే ప్రభుత్వ ఉత్తర్వుపై స్టే విధించి ఉండవచ్చు. విద్యార్థులు కూడా న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాలని నేను భావిస్తున్నాను." అని యాదవ్ అభిప్రాయపడ్డారు. మరోవైపు, 11వ, 13వ జేపీఎస్సీ పరీక్షల రద్దుపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు తప్పు అని కోర్టు ప్రాథమికంగా గుర్తించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాది అమృతాన్ష్ వత్స్ వివరించారు. ప్రస్తుతానికి కోర్టు ప్రభుత్వ ఉత్తర్వుపై స్టే విధించిందని పేర్కొన్నారు.

### ప్రభుత్వం రద్దు చేసిన పరీక్షలు ఇవే!..

రద్దైన పరీక్షలలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిప్యూటీ కలెక్టర్లు, దంత వైద్యులు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సివిల్ జడ్జీలు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు తదితర పోస్టుల నియామక పరీక్షలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్లు, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్లు వంటి పోస్టుల ఎంపికకు జరిగిన ఎగ్జామ్స్ కూడా ఉన్నాయి.

# ఇకపై బుజ్జగింపు రాజకీయాలు పనిచేయవు

రచనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దాని ప్రాధాన్యతను ప్రజలకు గుర్తు చేయాల్సిన సమయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం విచారకరమని అమిత్? షా వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు ఈ నిర్ణయంపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్న సమయంలో బుజ్జగింపు రాజకీయాలను ప్రజలు అంగీకరించరని అన్నారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ప్రజల్లోకి వెళ్లి దీనిపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం..

కాంగ్రెస్ పార్టీ 1937 నాటి తమ పార్టీ తీర్మానాన్ని ఆమోదించి పార్లమెంట్ చట్టాన్ని తిరస్కరిస్తోంది. దేశంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహించడం తనకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని అన్నారు. ఒకసారి వందేమాతరాన్ని రెండుగా విడగొట్టినందుకు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ఇప్పుడు అలాంటి తప్పు జరగకుండా చేసేందుకు దేశ ప్రజలు ఏకం కావాలని, కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గళం విప్పాలని పిలుపునిచ్చారు. బుజ్జగింపు రాజకీయాలు ఇక పనిచేయవు అని మనమంతా చాటిచెప్పాలని అన్నారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ఢిల్లీలో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగానే ఈ విధానాన్ని కొనసాగిస్తున్నామని పార్టీ వెల్లడించింది. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు నుంచే వందేమాతరం అంశంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ మాట్లాడుకుంటున్నారని బీజేపీ ఆరోపించింది. దీనిపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.

# త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టడంలో తప్పు లేదు

దశగా ఎంచుకున్నట్లయితే ఈ ఏడాది ఆరో క్లాస్ విద్యార్థులకు కొంత వెసులుబాటు కల్పించాలి. వచ్చే ఏడాది నుంచి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టాలి. అంతేకాకుండా ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా? లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా? అనే విషయాన్ని కూడా పునరాలోచించాలి." అని కేంద్రం తరఫున వాదిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికు ధర్మాసనం తెలిపింది.

### త్రిభాషా విధానం అమలు సముచితంగా జరగాలి : సుప్రీంకోర్టు..

ఇంగ్లీష్‌ను మాతృభాషగా పరిగణించాలా? విదేశీ భాషగా పరిగణించాలా? అనేది కూడా ఒక ఆందోళనకరమైన అంశమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం తరఫున, సీబీఎస్ఈతో పాటు ఇతర విద్యా బోర్డులలో ఏం జరుగుతుందో కూడా మీరు (కేంద్రం తరఫున వాదిస్తున్న ఐశ్వర్య భాటినుద్దేశించి) గమనించాలని కోరింది.

### 'అన్ని భాషలను గౌరవించాలి'..

"సీబీఎస్ఈ ఏదైనా భాషను ప్రవేశపెడుతున్నట్లయితే ఉపాధ్యాయుల కోసం కూడా ప్రణాళిక కలిగి ఉండాలి. అది వారి బాధ్యతే. పాఠశాలలు తప్పులు చేస్తే వాటిని నిలదీస్తాం. సీబీఎస్ఈ 23 భాషల ఎంపిక అవకాశాలను కల్పించింది. ప్రాంతీయ భాషల పట్ల మనకు ఎలాంటి న్యూనతా భావం ఉండకూడదు. ఇతర భాషల మాదిరిగానే మనం ఈ భాషలన్నింటినీ గౌరవించాలి. త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు కొన్ని సందేహాలు కలగడం సహజం. త్రిభాషా విధానం అమలులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సిఫార్సులు చేయడానికి, పరిష్కారాలను కనుగొనడానికి మేమే స్వయంగా ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తాం. లేదంటే ప్రభుత్వాన్ని ఒక కమిటీని ఏర్పాటు చేయమని కోరుతాం." అని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సీబీఎస్ఈ త్రిభాషా విధానం అమలు సముచితంగా జరిగేలా చూసుకోవాలని సూచించింది. ఈ విషయంలో పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడాలని తాము కోరుకోవడం లేదన్నారు.జులై 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు రెండు భారతీయ భాషలతో సహా మొత్తం మూడు భాషలను తప్పనిసరిగా అభ్యసించాలన్న సీబీఎస్ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ ప్రారంభంలో కొంతమంది పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశం మూడు భాషలకు సంబంధించినదని, తమ ఆందోళన ప్రధానంగా ఆరో తరగతి విద్యార్థుల గురించేనని ధర్మాసనానికి తెలిపారు. 6- 8వ తరగతుల వరకు పాఠ్యప్రణాళికను రూపొందించే అధికారం లేదా పరిధి సీబీఎస్ఈకి లేదని, ఆ బాధ్యత ఎన్‌సీఈఆర్‌టీకి ఉంటుందని పేర్కొన్నారు. త్రిభాష బోధన కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండాలని గ్రోవర్ అన్నారు.

# బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మిర్జా ఫఖ్రుల్

బిఎన్పిలో అత్యంత సీనియర్ నేతల్లో ఒకరైన ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ ఇప్పుడు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని చేపట్టనున్నారు. ఆయన ఎన్నో ఏళ్లుగా ప్రతిపక్ష నేతగా కీలక పాత్ర పోషించారు. బిఎన్పి తిరిగి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరివర్తనలో భాగంగానే ఫఖ్రుల్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

### శుక్రవారం ప్రమాణ స్వీకారం..

మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ శుక్రవారం సాయంత్రం బంగాభవన్‌లో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. సాయంత్రం 7.30 గంటలకు యాక్టింగ్ స్పీకర్ కైసర్ కమాల్ ఆయనతో ప్రమాణం చేయించనున్నట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది.

### 35 ఏళ్ల తర్వాత పోటీ ఎన్నిక

బంగ్లాదేశ్ అధ్యక్ష ఎన్నికల్లో గురువారం జరిగిన పోలింగ్ చారిత్రాత్మకంగా నిలిచింది. 35 ఏళ్లకు పైగా కాలంలో తొలిసారిగా అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులు పోటీ పడ్డారు. చివరిసారిగా 1991 అక్టోబర్ 8న పోటీ అధ్యక్ష ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో బీఎన్పీ అభ్యర్థి అబ్దుర్ రహ్మాన్ బిశ్వాస్ 172 ఓట్లతో విజయం సాధించారు. అవామీ లీగ్ అభ్యర్థి బద్రుల్ హైదర్ చౌదరికి 92 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత జరిగిన అన్ని అధ్యక్ష ఎన్నికల్లో ఒక్క అభ్యర్థి మాత్రమే బరిలో ఉండటంతో పోలింగ్ అవసరం లేకుండానే అధ్యక్షులు ఎన్నికయ్యారు. ఈసారి పార్లమెంట్‌లో బీఎన్పీకు ఉన్న బలమైన సంఖ్యాబలంతో ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ విజయం ఖాయమనే అంచనాలు ముందుగానే వ్యక్తమయ్యాయి. అధికార పక్షానికి 250 మంది ఎంపీలు ఉండగా, ప్రతిపక్ష కూటమికి 90 మంది సభ్యులు ఉన్నట్లు బంగ్లాదేశ్ సంగ్‌బాద్ సంస్థ తెలిపింది.

### అధ్యక్ష ఎన్నికకు కారణమేంటి?

మాజీ అధ్యక్షుడు మహ్మద్ షహాబుద్దీన్ జూలై 24న తన పదవికి రాజీనామా చేయడంతో కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. ఐదేళ్ల పదవీకాలం పూర్తికాకముందే ఆయన రాజీనామా చేశారు. తీవ్ర అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వైద్య చికిత్స అవసరమవడంతో పదవి నుంచి తప్పుకుంటున్నట్లు షహాబుద్దీన్ వెల్లడించారు. ఆయన రాజీనామా అనంతరం బంగ్లాదేశ్ రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంట్ స్పీకర్ హఫీజ్ ఉద్దీన్ అహ్మద్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. తాజా ఎన్నికలతో ఆ తాత్కాలిక వ్యవస్థకు ముగింపు పలికి, మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ దేశ 23వ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌కే ఝా, ఢిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ ఆర్‌కే శుక్లా, మేఘాలయ మాజీ డీజీపీ ఎల్ఆర్ బిష్ణోయ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

### ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ

ఈ కమిటీ ప్రధానంగా రెండు కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టనుంది. మొదటగా పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలు, నిరసనకారులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి వంటి తీవ్రమైన చర్యలపై విచారణ జరపనుంది. మహిళా నిరసనకారులపై హింస, పోలీసుల నిఘా వ్యవహారాలు, అల్లర్లను నియంత్రించే క్రమంలో అవసరానికి మించి భద్రతా బలగాలు వ్యవహరించాయా అన్న కోణంలో విచారణ చేయనుంది. మరోవైపు ఆందోళనకారుల వల్ల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, నిరసనల పేరుతో జరిగిన ప్రభుత్వ, ప్రజా ఆస్తుల ధ్వంసంపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరపనుంది.

"ఈ అత్యున్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసేటప్పుడు సభ్యుల వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. హెచ్ పీఈసీ చేసే సిఫార్సులు ఈ న్యాయస్థానానికి ఎంతో విలువైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలన అవసరమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మాకు నమ్మకం ఉంది. అదేవిధంగా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది వల్ల నిరసనకారులకు తీవ్రమైన హాని, గాయాలు కలిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా హెచ్ పీఈసీ అంచనా వేయవచ్చు. అలాగే, అటువంటి అకృత్యాలకు దారితీసిన పరిస్థితులు, అందుకు బాధ్యులైన వ్యక్తులు, బలాన్ని ప్రయోగించేటప్పుడు ఏవైనా చట్టాలు, నిబంధనలు లేదా ప్రమాణాలు ఉల్లంఘించారా? వంటి అంశాలను కూడా విచారించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. హెచ్ పీఈసీ చేపట్టే విచారణ ఒక్కసారి మాత్రమే చేసే ప్రక్రియగా పరిమితం కాకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాలపై నిరంతర, క్రమబద్ధమైన సమీక్షను చేపట్టాలని, అలాగే తమకు మధ్యంతర నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని కమిటీని ఆదేశించింది. నీట్? పరీక్ష పేపర్ లీకేజీ ఆరోపణలపై అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో విస్తృత సంస్కరణలు కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే జూలై 20న ఢిల్లీలో జజీూ ఆధ్వర్యంలో పార్లమెంటు వైపు జరిగిన ర్యాలీలో నిరసనకారులు- భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణలు జరిగాయి. పార్లమెంటు వైపు వెళ్లడానికి ప్రయత్నించిన గుంపులను చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది లాఠీలు, బాష్పవాయువు షెల్స్‌ను ఉపయోగించారు. ఆ తర్వాత నిరసనకారులను పోలీసు సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లుగా ఉన్న అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఆందోళనల్లో మితిమీరిన బలప్రయోగం జరిగిందనే ఆరోపణలకు దారితీసింది. ఈ క్రమంలోనే దీనిపై పిటిషన్ దాఖలు చేయగా సుప్రీం విచారణ చేపట్టి తాజాగా అత్యున్నత స్థాయి విచారణ కమిటీని నియమించింది.

# నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు

కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా మంత్రి ఈ సమీక్షలను నిర్వహించనున్నారు. రెవెన్యూ అంశాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, హౌజింగ్ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల, శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

## కలెక్టర్లకు పౌరసత్వం ఇచ్చే అధికారాలు..




విశ్వంభర, నేషనల్ బ్యూరో : గుజరాత్, రాజస్తాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర (గిరిజన ప్రాంతాలు మినహా) రాష్ట్రాలతో పాటు జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాల్లోని జిల్లా కలెక్టర్లకు కేంద్ర హోం శాఖ కీలకమైన అధికారాలను కట్టబెట్టింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), 2019 కింద పౌరసత్వ దరఖాస్తులను పరిశీలించి, మంజూరు చేసే అధికారాలను సాధికార కమిటీల నుంచి ఈ ప్రాంతాల కలెక్టర్లకు బదిలీ చేసింది. ఈ మేరకు 'పౌరసత్వ (మూడో సవరణ) నిబంధనలు 2026'ను ప్రభుత్వం నోటిఫై చేసింది. కొత్త నిబంధనల ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తుదారుడు పౌరసత్వానికి తగిన వ్యక్తి అని సంతృప్తి చెందితే కలెక్టర్ నేరుగా భారత పౌరసత్వాన్ని మంజూరు చేయవచ్చు. ఇప్పటి వరకు వివిధ కమిటీల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ తక్షణమే సంబంధిత కలెక్టర్లకు బదిలీ అవుతాయి. దరఖాస్తు సమర్పించిన వెంటనే సిస్టమ్ ద్వారా ఆటోమేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ జనరేట్ అవుతుంది. ఆ తర్వాత అన్ని పత్రాలను కలెక్టర్ సరిచూసి అవసరమైన విచారణ జరుపుతారు. దరఖాస్తుదారుడి అర్హతను పరిశీలించిన అనంతరం చట్టంలో నిర్దేశించిన ప్రకారం ప్రమాణ స్వీకారం (ఓత్ ఆఫ్ అలెజియెన్స్) చేయించి పౌరసత్వ ధృవీకరణ పత్రం అందజేస్తారు.

## వరలక్ష్మీ వ్రతం ఎఫెక్ట్.. ఆకాశాన్నంటిన పూల ధరలు

**పండుగలు వస్తే చాలు పూల ధరలకు రెక్కలు**

**ఆవేదన చెందుతున్న సామాన్యులు**

**వర్షాల కారణంగా డిమాండ్‌కి తగినంత పూలు లేవంటున్నవ్యాపారులు**



విశ్వంభర, హైదరాబాద్: శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పూల మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. వరలక్ష్మీ పూజ కోసం పూలు కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ ప్రజలు మార్కెట్లకు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని మార్కెట్లలో పూల ధరలు అమాంతం పెరిగి, సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ధరలు అధికంగా పెరగడంతో కావాల్సిన పూలు కొనుగోలు చేయలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగల సమయాల్లో చాలు పూల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొజంజాహీ మార్కెట్లో నిన్న మొన్నటి వరకు సుమారు రూ.70 పలికిన ఛామంతి, గులాబీలు ఇప్పుడు ఏకంగా రూ.300 నుంచి రూ.350 అమ్ముతున్న పరిస్థితి ఉంది. ఇక రూ.30 ఉండే కిలో బంతి పూలు ఏకంగా రూ.80 నుంచి 100కు విక్రయిస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. అయితే పండుగల సమయంలో డిమాండ్?కి తగినంత పూలు లేకపోవటం మరోవైపు వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్ భారీగా ఉండటంతో కిలో గులాబీలు, ఛామంతి ధర మార్కెట్?లో భారీగానే పలుకుతుండగా, తామర పువ్వుల ధరలు సైతం రెట్టింపయ్యాయి. మార్కెట్లో పూల ధరల తీరు మల్లెలు, జాజులు కిలో సుమారుగా రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. బంతి పూలు కిలో రూ.80 నుంచి రూ.100 వరకు రకం బట్టి రేటు పలుకుతున్నాయి. తామర, కలువ పువ్వులు ఒక్కోటి రూ.50 నుంచి రూ.70 వరకు రేటు ఉంది. పూజకు పూలు తప్పనిసరి కావడంతో మహిళలు ఎక్కువ నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు బడ్జెట్ సరిపోక అవస్థలు పడుతున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంత ఎక్కువగా పూల రేట్లు ఉంటే సామాన్య ప్రజలు పూజలు చేసుకోలేమంటూ ఆవేదన చెందుతున్నారు.

## ఇప్పుడు నిన్ను నాన్న చూసి గర్వపడుతారు అమ్మ



విశ్వంభర, నేషనల్ బ్యూరో: కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తన తల్లి, సీనియర్ నేత సోనియా గాంధీని ఉద్దేశించి సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. సోనియా గాంధీ రాసిన కొత్త పుస్తకం "బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్" విడుదల కానున్న సందర్భంగా ఆయన ఎక్స్ లో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని రాహుల్ గాంధీ స్పందిస్తూ.. "నేను అమ్మను, నాన్నను కలిసి చూసి 35 ఏళ్లకు పైగా అయ్యింది. నాన్న వెళ్ళిపోయిన నాటి నుంచి జీవితంలో ఎదురైన ప్రతి సవాలును అమ్మ ఎంతో ధైర్యంతో, ఆత్మగౌరవంతో ఎదుర్కోవడం నేను ప్రత్యక్షంగా చూశాను. నాన్న లేని ఆ లోటుతో అమ్మ ఎంత కష్టపడిందో కేవలం ప్రియాంకకు, నాకు మాత్రమే తెలుసు" అని పేర్కొన్నారు. అత్యంత వ్యక్తిగత విషయాలను బయటకు చెప్పడానికి ఇష్టపడని సోనియా గాంధీ, ఈ పుస్తకం ద్వారా తన జీవిత ప్రయాణాన్ని ప్రపంచంతో పంచుకోవడం సాధారణ విషయం కాదని ఆయన అన్నారు. కోట్లాది మంది అభిమానులకు ఈ పుస్తకం అందుబాటులోకి వస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ పవిత్రమైన రోజున ఆకాశం నుంచి నాన్న నవ్వుతూ, తన ప్రియమైన సోనియాను చూసి గర్వపడుతుంటారని రాహుల్ గాంధీ ఆ సందేశంలో రాసుకొచ్చారు.

## కారంలో 30 శాతం చెక్కపొడి..



విశ్వంభర, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో కల్తీ మసాలా తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు, ఆహార కల్తీ పర్యవేక్షణ బృందాలు సంయుక్తంగా దాడులు చేశాయి. మేడిపల్లి శ్రీనివాస్‌నగర్ కాలనీలోని సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసులు దాడి చేసి తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా తయారీ చేస్తున్నట్లు గుర్తించారు.కారం పొడిలో ఏకంగా 30 శాతం చెక్క పొడి కలిపినట్లు.. స్వదేశీ స్వస్తిక్ బ్రాండ్ పేరుతో డూప్లికేట్ ప్యాకింగ్, లేబులింగ్ చేసినట్లు నిర్ధరించారు. ఒరిజినల్ బ్రాండ్‌ను పోలిన ప్యాకెట్లలో కల్తీ కారం పొడి విక్రయానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. వీటిని వివిధ వాణిజ్య సంస్థలు, వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తేల్చారు. మొత్తం 10,890 కిలోల కల్తీ ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని అంచనా. ఈ ఘటనలో నిర్వాహకులు సత్యనారాయణ, రుద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## రూ.20 లంచం కేసులో 30ఏళ్లకు నిర్దోషులుగా తేల్చిన సుప్రీంకోర్టు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: 20 రూపాయల లంచం తీసుకున్నారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు నిర్దోషులుగా తేలారు. 30 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు సాగిన ఈ న్యాయపోరాటంలో ఎట్టకేలకు తాజాగా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో గుజరాత్?కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను దోషులుగా తేల్చుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెడుతూ వారిని నిర్దోషులుగా జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్?లతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. లంచం డిమాండ్ చేసినట్లు రుజువులు లేవని, కేవలం రూ.20 రికవరీ చేసినంత మాత్రాన దోషిగా నిర్ధారించలేమని కోర్టు పేర్కొంది. 1996 ఫిబ్రవరిలో గుజరాత్ ఆనంద్ జిల్లాలోని బెచ్రీ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అక్కడ పని చేసే క్లర్క్ రూ. 120 లంచం డిమాండ్ చేశాడని అందులో రూ. 100 తనకు కాగా మరో రూ. 20 ప్యూన్ కోసం అని అడిగాడని సదరు విద్యార్థి ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన అధికారులు ట్రాప్ చేసి డబ్బులు తీసుకుని ఇన్ కమ్ సర్టిఫికేట్ ఇస్తుండగా ప్యూన్ ను రెడ్ హ్యాండెడ్?గా పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.20 స్వాధీనం చేసుకున్నారు. అయితే క్లర్క్ డిమాండ్ చేశాడన్న రూ.100 మాత్రం ఎక్కడా లభించలేదు. దీంతో కేవలం నగదు రికవరీ అయినంత మాత్రాన లంచం తీసుకున్నట్లు నిర్ధారించలేమని, లంచం డిమాండ్ చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉండాలని ఈ సందర్భంగా ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాగే ఫిర్యాదుదారుడి వాంగ్మూలంలో పలు వైరుధ్యాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది.

## సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం.. నన్ను బాధ్యురాలిని చేయొద్దు: కొండా సురేఖ



విశ్వంభర, హైదరాబాద్: టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) ఇచ్చిన షోకాజ్ నోటీసులపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో డీఏసీ వివరణ కోరిన విషయం తెలిసిందే. దీంతో కొండా సురేఖ స్పందిస్తూ క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చారు. ఈ మేరకు కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు. "నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలు. సుస్మిత వ్యాఖ్యల వ్యవహారంలో నా ప్రమేయం లేదని గుర్తించాలి. సుస్మిత వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు. నాకు సంబంధం లేని అంశంలో నా వివరణ కోరడం సముచితం కాదు. కాంగ్రెస్ నాయకత్వం, పార్టీ నియమావళిపై నాకు గౌరవముంది. షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలి"అని కొండా సురేఖ పేర్కొన్నారు.

## సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసు దోషి సజ్జన్ కుమార్.. జైల్లో మృతి



విశ్వంభర, నేషనల్ బ్యూరో: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆయనను గురువారం ఉదయం హుటాహుటిన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే సజ్జన్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరణానికి గల కారణాలను వైద్యులు ఇంకా నిర్ధరించలేదు. అనారోగ్యంతో కన్నుమూసినట్లు ప్రాథమిక సమాచారం.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం దిల్లీలో 1984 నవంబరు 1న సిక్కు వ్యతిరేక అల్లర్లు చోటుచేసుకున్నాయి. నానావతి కమిషన్ నివేదిక ప్రకారం.. ఈ అల్లర్లలో 2,700 మందికి పైగా మరణించారు. ఇందుకు సంబంధించి సజ్జన్ కుమార్‌పై మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ఇందులో రెండు కేసుల్లో సజ్జన్ దోషిగా తేలగా.. మరో కేసులో న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. ఐదుగురు సిక్కులను చంపి, గురుద్వారాకు నిప్పు పెట్టిన కేసులో 2018లో దిల్లీ హైకోర్టు ఆయనకు జీవితఖైదు విధించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగులో ఉంది. ఇక, సర్దార్ జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌ను చంపిన కేసులోనూ 2025 ఫిబ్రవరిలో దిల్లీ హైకోర్టు ఆయనను దోషిగా తేల్చి జీవితఖైదు విధించింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అయిన సజ్జన్.. అవుటర్ దిల్లీ స్థానం నుంచి మూడు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. జీవితఖైదు పడిన తర్వాత పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

## మంత్రి కొండా సురేఖ ఓఎస్డీపై కేసు నమోదు




విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్‌పై కేసు నమోదైంది. సుమంత్ తనను బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశారని ఓ వ్యాపారి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వనందుకు తనపై దాడి చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మొదట మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పీఎస్‌కు బదిలీ చేశారు.

## గేదెల దాడి.. కొమ్ముల్లో ఇరుక్కుని యువకుడి మృతి

విశ్వంభర, కౌడిపల్లి: మెదక్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఓ యువకుడిని గేదె పొడిచి చంపింది. కౌడిపల్లి మండలం అంతారం గేటు వద్ద ఈ ఘటన జరిగింది. గేదెలు రోడ్డు దాటుతుండగా దుర్గాప్రసాద్ అనే యువకుడు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గేదెలు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. దాడి తీవ్రతకు ఓ గేదె కొమ్ముల్లో ఆ యువకుడు ఇరుక్కుపోయాడు. దీంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దుర్గాప్రసాద్ స్వస్థలం కొల్చారం మండలం కిష్టాపూర్. ఈ ఘటనలో మరో వ్యక్తికి కూడా తీవ్రగాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉంది.




## శిర్డీ సాయిబాబాపై అభ్యంతరకర కంటెంట్.. కేంద్రానికి నోటీసులు




విశ్వంభర, నేషనల్ బ్యూరో: శిర్డీ సాయిబాబాను లక్ష్యంగా చేసుకొని, రూపొందించిన అభ్యంతరకర వీడియోలను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. సంబంధిత వీడియోలను యూట్యూబ్ నుంచి తొలగించాలని వచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోవాలని గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీకి సూచించింది. ఇదే అంశంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖతోపాటు గూగుల్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. శిర్డీ సాయిబాబాకు సంబంధించి అభ్యంతరకర వీడియోలు తొలగించే అంశంపై వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జీఏసీ)కు దిల్లీ హైకోర్టు గతంలోనే సూచించింది. ఈ క్రమంలో జీఏసీ ఇటీవల చర్యలు తీసుకున్నప్పటికీ ఇంకా కొన్ని వీడియోలు అలాగే ఉన్నాయని పేర్కొంటూ శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్.. న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. వివాదాస్పదమైన కంటెంట్ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని, వీటిని ఇలాగే కొనసాగిస్తే.. మత సామరస్యానికి హాని కలిగించే ప్రమాదం ఉందని వాదించింది. వాదనలు విన్న దిల్లీ న్యాయస్థానం తదుపరి విచారణను సెప్టెంబర్ 7కు వాయిదా వేసింది. ఈలోగా ఇంకేమైనా కొత్త ఫిర్యాదులు దాఖలైతే సంబంధిత అధికారులు వాటిని పరిశీలిస్తారని పేర్కొంది.

## 'నేను పక్కా ఇండియన్‌ను.. చైనీస్ అనకండి.. కోపం వస్తుంది'



విశ్వంభర, నేషనల్ బ్యూరో: 'మేం భారతీయులమే..మీ సాటి పౌరులమే.. మమ్మల్ని ఇండియన్స్ అనే పిలవండి' అని అంటోంది ఓ చిన్నారి. అరుణాచల్‌ప్రదేశ్ కు చెందిన ఈ చిన్నారి మాట్లాడిన వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారడమే గాక.. దేశంలో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఎదుర్కొంటోన్న జాతి వివక్ష అంశంపై చర్చకు దారితీసింది. అసలేం జరిగిందంటే.. ఓ వ్యక్తి ఈ చిన్నారిని.. 'నువ్వు చైనీస్‌వా?' అని ప్రశ్నించాడు. సాధారణంగా అయితే ఇలాంటి ప్రశ్నకు ఆ వయసు పిల్లలు సమాధానం చెప్పకుండా నవ్వుతూనో.. ఏడుస్తూనో అక్కడి నుంచి వెళ్లిపోతారు. కానీ, ఈ బాలిక అలా చేయలేదు. తనను 'చైనీస్' అనడంపై ఎంతగా బాధించిందో ఆమె స్పష్టంగా వివరించింది. "మేం భారతీయులం.. మీరు ఇలా చైనీస్ అంటే చాలా బాధగా అనిపిస్తుంది. కోపం వస్తుంది. మేం ఈ దేశంలోనే ఉంటున్నాం. ఇటానగర్‌లో నివసిస్తున్నాం. మమ్మల్ని భారతీయులనే పిలవండి" అని సమాధానమిచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియోను ఓ యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. "భారత్ అంటేనే విభిన్నమైన ముఖాలు, సంప్రదాయాలు, ఆచారాలు, భాషలు. వీటన్నింటి కలయికే మన దేశం" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఆ పాప పేరేంటీ..? ఈ సంఘటన ఎప్పుడు, ఎక్కడ జరిగిందనే దానిపై స్పష్టమైన వివరాల్లేవు. అయినప్పటికీ.. ఎంతో అమాయకంగా ఈ చిన్నారి చేసిన అభ్యర్థనకు నెటిజన్లు స్పందిస్తున్నారు. 'ఓ చిన్ని యువరాణి.. నువ్వు ఎప్పటికీ భారతీయురాలివే..' అంటూ కొందరు ఆమెను ప్రశంసిస్తున్నారు.

## మహాత్మా గాంధీ చేతిరాత ప్రతులు.. వేలంలో రూ.16.2 కోట్లు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: సత్యం, అహింస, సేవ తదితర అంశాలపై మహాత్మా గాంధీ.. తన సన్నిహితుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆనంద్ టీ హింగోరానీకి రాసిన చేతిరాత ప్రతులను ఇటీవల వేలం వేశారు. మొత్తం 688 ప్రతులు రూ.16.2 కోట్లకు అమ్ముడయ్యాయి. వేలంలో భారీ మొత్తంలో అమ్ముడైన భారతీయ ప్రతులుగా రికార్డు సృష్టించాయి. హింగోరానీ సతీమణి విద్య మరణానంతరం.. స్నేహితుడికి మార్గదర్శిగా నిలుస్తూ మహాత్మా గాంధీ వరుసగా సందేశాలు పంపించారు. రెండేళ్లపాటు అలా రాసిన ప్రతులను సేకరించి "ఎ థాట్ ఫర్ ది డే" పేరుతో పుస్తకంగా ముద్రించారు. వీటిలో చేతిరాత ప్రతులు, ఫొటోలను సాఫ్రోన్ ఆర్ట్ గ్యాలరీలో వేలం వేశారు.

# ప్రతిఘటించేవారంతా మేధో నక్సలైట్లేనా..?

**నేను నరేంద్ర మోడీకి మనసులోనే ధన్యవాదాలు చెబుతున్నాను. గత ఐదేళ్లుగా నేను వెతుకుతున్న ఒక పదాన్ని చివరకు ఆయన ఇచ్చారు.మేధో నక్సలైట్.గత ఐదేళ్లుగా నేను ఆలోచిస్తున్నాను. ఒక వ్యక్తికి వ్యవస్థపై కోపం ఉంది, అతనికి అన్యాయం జరిగింది, అతను అధికారాన్ని, సంస్థలను ప్రశ్నిస్తున్నాడు. కానీ తుపాకీ ఎత్తడు, రోడ్డుపై హింసకు పాల్పడడు, చట్టబద్ధమైన మార్గాన్ని వదలడు. అలాంటి వ్యక్తిని చివరకు ఏ వర్గంలోకి చేర్చాలి?ఇప్పుడు ప్రధానమంత్రి ఆ వర్గాన్ని కూడా చెప్పేశారు.**

నా అక్క చిన్నప్పుడు సినిమా స్టార్ ధర్మేంద్రను మనసులోనే ప్రేమించేవారు. బహుశా 'అనుపమ' సినిమా చూసిన తర్వాత ఆమెకు ఆ ప్రేమ పుట్టి ఉంటుందని నాకు అనిపిస్తుంది. చాలా కాలం తర్వాత మా పెద్దనాన్న నోట ఒక వ్యక్తి గురించి ఒక అందమైన మాట విన్నాను. అమ్మాయిలు ఇలాంటి ప్రేమలో పడితే దాన్ని ప్రేమ అనరు, అనురాగం లేదా అనుబంధం అంటారని ఆయన చెప్పారు.ఆ మాట నాకు ఇప్పటికీగుర్తుంది.అంటే మాఅక్కకు ధర్మేంద్రపై లవ్ లేదు, కేవలం అనుబంధం ఉంది. అనుబంధం అనేది లవ్ కంటే ఒక మెట్టు తక్కువ. అందుకే దానిలో సామాజిక ప్రమాదం కూడా తక్కువ. లవ్ అయితే విషయం తీవ్రంగా మారేది, నేరంగా పరిగణించబడేది. కానీ అనుబంధం మాత్రమే కావడంతో విషయం నిశ్శబ్దంగా ముగిసిపోయింది.మీరా విషయంలో అలా జరగలేదు.ఆమెకు కృష్ణుడిపై అనుబంధం కాదు, ప్రేమ ఉంది. అందుకే ఆమె దాన్ని దాచుకోకుండా బహిరంగంగానే చెప్పింది:"నా వాడు గిరిధర గోపాలుడు, మరొకరు ఎవరూ లేరు."ఇక ఇప్పుడు ఏం చేయాలో అది చేసుకోండి.ప్రేమలో పడిన మనిషి ప్రపంచం ఏమనుకుంటుందో, కుటుంబం ఏం చేస్తుందో, సమాజం ఏం అనుకుంటుందో, అధికారం ఏమనుకుంటుందో పట్టించుకోవడం మానేస్తాడు. అందరినీ పక్కన పెట్టి, "నా వాడు ఇతనే,మరొకరు ఎవరూ లేరు"అని చెప్పేస్తాడు. సంజయ్ సిన్హా అక్క చెప్పలేకపోయింది. మీరా చెప్పేసింది.ఇప్పుడు ప్రధానమంత్రి గారి 'మేధో నక్సలైట్' అనే పదంలో కూడా నాకు ఇదే తేడా కనిపిస్తోంది.ఆయుధాలు పట్టుకుని అడవుల్లోకి వెళ్లే వ్యక్తి చట్టం దృష్టిలో నక్సలైట్ కావచ్చు. హింసకు పాల్పడే వ్యక్తి నేరస్థుడు కావచ్చు. ఏ నాగరిక సమాజంలోనూ హింసను సమర్థించడం ఆమోదయోగ్యం కాదు.

కానీ తుపాకీ ఎత్తని, ఎవరినీ చంపని, ఎలాంటి హింసకు పాల్పడని వ్యక్తిని ఏమని పిలవాలి?

తన హక్కుల కోసం కోర్టుకు వెళ్తాడు. ప్రశ్నలు అడుగుతాడు. ప్రభుత్వ విధానాలతో విభేదిస్తాడు. తనకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడతాడు. అయినప్పటికీ అతని మనసులో వ్యవస్థపై కోపం అలాగే ఉంటుంది.మేధో నక్సలైట్.దేశంలో మేధో నక్సలైట్ల సంఖ్య ఎంత ఉందంటే, వారిని లెక్కపెడుతూ లెక్కపెడుతూ చివరకు ప్రభుత్వ కాలిక్యులేటర్లే పనిచేయడం మానేస్తాయని నాకు అనిపిస్తోంది.

ఈ దేశంలో ఎప్పుడో ఒకసారి వ్యవస్థ చేత ఇబ్బంది పడని వ్యక్తి ఎవరు?ఒకరి ఉద్యోగం పోయింది. మరొకరి భూమి సమస్యలో చిక్కుకుంది. ఇంకొకరి వ్యాపారం నష్టపోయింది. ఎవరో ఫిర్యాదు చేస్తే పోలీసులు చర్య తీసుకోలేదు. మరొకరిని ప్రభుత్వ కార్యాలయాలు పదేపదే తిప్పాయి. ఇంకొకరు కోర్టులో ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. మరొకరికి అధికార వ్యవస్థ ముందు తనకు ఎలాంటి విలువ లేదనిపించింది.

కోట్లాది మంది మనసుల్లో వ్యవస్థపై ఏదో ఒక ఫిర్యాదుఉంది. అసహనంఉంది. నిరాశ ఉంది. ఎవరైనా ఆ నిరాశలో తుపాకీ ఎత్తుకుంటే అతను నక్సలైట్ అయిపోయాడు.కానీ తుపాకీ ఎత్తకుండా, తన కోపాన్ని తనలోనే అదుపులో పెట్టుకుని, మాట్లాడటం ద్వారా, రాయడం ద్వారా, ఆందోళన చేయడం ద్వారా, కోర్టుకు వెళ్లడం ద్వారా తన నిరసనను వ్యక్తం చేసిన వ్యక్తిని ఏమంటారు?అతన్ని మేధో నక్సలైట్ అంటారా?లెక్కపెట్టడం మొదలుపెట్టండి.

**గ్రామ సర్పంచ్‌పై కోపంగా ఉన్నవ్యక్తి..మేధో నక్సలైట్.**
**పట్వారీతో ఇబ్బంది పడుతున్న రైతు..మేధో నక్సలైట్.**
**థానేదార్‌కు ఫిర్యాదు చేసి తిరిగి వచ్చిన వ్యక్తి.. మేధో నక్సలైట్.**
**ఎస్డీఎం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పౌరుడు.. మేధో నక్సలైట్.**
**కలెక్టర్‌ను న్యాయం కోరుతున్న వ్యక్తి .. మేధో నక్సలైట్.**
**ట్రయల్ కోర్టు వాయిదాలతో అసంతృప్తిగా ఉన్న వ్యక్తి .. మేధో నక్సలైట్.**
**హైకోర్టులో అప్పీల్ కోసం తిరుగుతున్న వ్యక్తి .. మేధో నక్సలైట్.**
**సుప్రీంకోర్టు వరకు వెళ్లలేకపోతున్న వ్యక్తి .. మేధో నక్సలైట్.**

అధికార వ్యవస్థలోని ఏదైనా విధానం వల్ల బాధ పడి ప్రశ్నలు అడుగుతున్న వ్యక్తి ఈ జాబితాలో అందరికంటే ముందుంటాడు.అతను తుపాకీ ఎత్తడం లేదు. కానీ అతని మనసులో ఆగ్రహం మాత్రం ఎగసిపడుతోంది.ఎవరో గ్రామ సర్పంచ్‌నుమనసులోనే కాల్చేస్తుండవచ్చు. మరొ కరు పట్వారీని. ఇంకొకరు థానేదార్‌ను. మరొకరు ఎస్డీఎంను. ఇంకొకరు కలెక్టర్‌ను.ఎవరో ట్రయల్ కోర్టు జడ్జిపై కోపంగా ఉండవచ్చు. మరొకరు హైకోర్టు జడ్జిపై. ఇంకొకరు సుప్రీంకోర్టు ఏదో ఒక తీర్పుపై.బయటకు అందరూ ప్రశాంతమైన పౌరులే.కానీ లోపలికి తొంగిచూస్తే ప్రతి ఒక్కరూ తమ తమ కోర్టులను ఏర్పాటు చేసుకుని కూర్చున్నారు.



అక్కడ ఎవరో ఇప్పటికే దోషిగా తేలిపోయారు. మరొకరు నిర్దోషిగా విడుదలయ్యారు. ఇంకొకరిని మనసులోని కోర్టులో ఎన్నిసార్లు కాల్చేశారో లెక్కే లేదు.నేను గత ఐదేళ్లుగా జబల్ పూర్‌లో కూర్చున్నాను.ఎందుకు కూర్చున్నాను? నాకు జరిగిన మోసంపై ఫిర్యాదుతో. పోలీస్ స్టేషన్ నుంచి పైస్థాయి అధికారుల వరకు వెళ్లాను. కోర్టు తలుపు తట్టాను. ఒక చోట నా ఫిర్యాదు వినిపించకపోతే మరోచోటికి వెళ్లాను.ఒక తేదీ వచ్చింది. తర్వాత మరో తేదీ. ఆ తర్వాత ఇంకో తేదీ.ప్రతి తేదీన ఒక మంచి పౌరుడిలా కోర్టుకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తూనే ఉన్నాను.నేను ఎవరిపైనా రాళ్లు విసరలేదు. ఎవరినీ కొట్టలేదు. తుపాకీ ఎత్తలేదు. ఏ కార్యాలయానికీ నిప్పు పెట్టలేదు.కానీ నా లోపల కోపం లేదా?ఉంది.నేను మనసులోనే చాలామంది జడ్జిలను ఎన్నిసార్లో కాల్చేశాను. అది నా మనసులోని కోర్టు కాల్పులు. తుపాకీ కాల్పులు కాదు.నన్ను లోపల నుంచి తీవ్రంగా గాయపరిచిన తీర్పులపై మనసులో ఎన్నిసార్లు తీర్పులు ఇచ్చానో నాకు తెలియదు. ఎప్పుడో పోలీసులను శిక్షించాను.ఎప్పుడో అధికారులను. ఎప్పుడో కోర్టును. మరెప్పుడో నేను పోరాడుతున్న వ్యక్తులను.మనసులో తుపాకులు పేలాయి.చాలా పేలాయి.కానీ నిజ జీవితంలో నేను ఏంచేశాను?చట్టం మార్గాన్ని వదిలేశానా? లేదు.నేను చట్టాన్ని చదవడం ప్రారంభించాను. హక్కుల కోసం చేసే పోరాటాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను.జర్నలిజం వెనుకబడిపోయింది. ఢిల్లీ వెనుకబడిపోయింది. నా పాత జీవితం వెనుకబడిపోయింది. కుటుంబం కూడా ఎక్కడో వెనుక మిగిలిపోయింది. నేను ఎంతగా గాయపడ్డానో, అంతగా చట్టంలోకి లోతుగా వెళ్లాను.నేను ఇప్పటికీ నిలబడి ఉన్నాను.అడ్డంగా నిలబడి ఉన్నాను.నా చేతిలో తుపాకీ లేదు. ఎలాంటి ఆయుధం లేదు.నా దగ్గరచట్టం ఉంది. నాదగ్గర ఆలోచించే మెదడు ఉంది.ప్రధానమంత్రి పదకోశంలో వ్యవస్థ చేత బాధపడే వ్యక్తి, వ్యవస్థపై కోపంగా ఉండే వ్యక్తి, ప్రభుత్వ విధానాలతో విభేదించే వ్యక్తి, తన హక్కుల కోసం పోరాడే వ్యక్తి, చట్టబద్ధమైన మార్గంలో నడిచే వ్యక్తి మేధో నక్సలైట్ అయితే, ఈ దేశంలో వ్యవస్థ విధానాల వల్ల బాధపడుతున్న ప్రతి ఒక్కరూ మేధో నక్సలైట్లే.వ్యవస్థ చేత నెట్టివేయబడ్డాడు కానీ తుపాకీ ఎత్తలేదు.

అతను రాస్తూ ఉండవచ్చు. మాట్లాడుతుండవచ్చు. ఆందోళన చేస్తుండవచ్చు. కోర్టుకు వెళుతుండవచ్చు. తనలో ప్రశ్నలతో మండిపోతూ ఉండవచ్చు.అతను మేధో నక్సలైట్.మీరు మేధో నక్సలైట్ల సంఖ్యను లెక్కపెడుతూనే ఉంటారు. ఆయుధాలు పట్టిన నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని మీరు చెబుతున్నారు. చేయండి .హింసను ఎవరు సమర్థిస్తారు?కానీ ఒక విషయం అర్థం చేసుకోండి.

ప్రతి అసమ్మతికి నక్సలిజం అనే పేరు పెట్టడం వల్ల ప్రజల మనసుల్లోని మంట ఆరిపోదు. పైగా, తన ఫిర్యాదును వినేవారు ఎవరూ లేరని, తన ప్రశ్నకు సమాధానం చెప్పడానికి బదులుగా తనకు ఒక ముద్ర వేసేశారని ఆ వ్యక్తికి అనిపిస్తుంది.ఇదే అసలు విషాదం.మేధో నక్సలైట్‌కు మీరు శిక్ష కూడా విధించలేరు.

మనసులో పేలిన తుపాకీకి ఏ చట్టంలోని ఏ సెక్షన్ పెడతారు?ఆలోచించే మెదడు ఉన్నవాళ్లు చివరికి చట్టంతోనే పోరాడతారు.వాళ్లు తుపాకీ ఎత్తడానికి బదులు చట్టం పుస్తకం ఎత్తుతారు. అడవుల్లోకి వెళ్లడానికి బదులు కోర్టుకు వెళ్తారు. హింసకు పాల్పడటానికి బదులు వాదిస్తారు. వారిని ఓడించడానికి పోలీసు అవసరం లేదు.. సమాధానం కావాలి.వారిని మౌనం చేయడానికిలాఠీ అవసరంలేదు ..తర్కంకావాలి. వారిని అంతం చేయడానికి తుపాకీ అవసరం లేదు..న్యాయం కావాలి.ఇతరుల గురించి ఎందుకు మాట్లాడాలి?నేను తుపాకీ ఎత్తలేదు. జీవితంలోని ఈ దశలో చట్టాన్ని ఎత్తుకున్నాను. అన్నీ వదిలేసి లా చదవడం ప్రారంభించాను. ప్రశ్నలు అడగడం కోసం.ప్రశ్నించడం, అసమ్మతి వ్యక్తం చేయడం, తన బాధను చెప్పుకోవడం, తన హక్కుల కోసం చట్టబద్ధమైన మార్గంలో పోరాడటం..ఇవన్నీ మేధో నక్సలిజమేఅయితే...లెక్కపెట్టడం మొదలుపెట్టండి. మేధో నక్సలైట్లను లెక్కపెడుతూ లెక్కపెడుతూ వ్యవస్థ అలసిపోతుంది.కానీ లెక్క మాత్రం ఎప్పటికీ పూర్తికాదు.

**-సంజయ్ సిన్హా**

# ఆదర్శ స్త్రీమూర్తి చారుమతి


## (శ్రావణ వరలక్ష్మి వ్రతం సందర్భంగా)

**'వర' అంటే శ్రేష్టమైన. 'లక్ష్మి' అంటే సంపద లేదా గుర్తు. 'వరలక్ష్మి' అంటే శ్రేష్టమైన సంపదకు గుర్తు అని అర్థం.చారు అంటే మంచి. మతి అంటే బుద్ధి. చారుమతి అంటే మంచి బుద్ధి కలది అని అర్థం.**

" నా గృహం గృహమిత్యాహుః గృహిణీ గృహముచ్యతే అని శాస్త్ర వచనం. ఇల్లాలు ఉంటేనే ఇంటికి కళ. గృహిణి ఉంటేనే గృహం అంటారు అని అర్థం. ఇల్లాలే ఇంటికి దీపమని నానుడి. ఇవన్నీ ఉత్తమ గృహిణుల గురించి పెద్దలు చెప్పిన మాటలు. ఇలాంటి కోవలోకి చెందినది చారుమతి. అసలు పేరులోనే తెలుస్తుంది ఆమె పోకడ. చారు అంటే మంచి. మతి అంటే బుద్ధి. చారుమతి అంటే మంచి బుద్ధి కలది అని అర్థం. ఎంత మంచిదంటే తరతరాలుగా శ్రావణ శుక్రవారం వ్రతం చేసుకున్న ప్రతి స్త్రీ ఆమె కథ చెప్పుకునేటంత మంచి బుద్ధి కలిగి ఉన్నదని అర్థం. అది ఎలా తెలుస్తుంది? ఆమె ప్రవర్తనలో వ్యక్తం అవుతుంది. ఆమె ప్రవర్తన ఎలాంటిదో... ఆమె కథ వల్ల తెలుసుకుందాం! ఆమె జీవితాన్ని మనం కూడా ఆదర్శంగా తీసుకుందాం!వరలక్ష్మి అనుగ్రహానికి పాత్రులమవుదాం!"

**చారుమతి వృత్తాంతము..**

మగధ దేశంలో కుండిన నగరంలో చారుమతి అనే ఇల్లాలు ఉండేది. ఆమె గయ్యాళికాక హితముగా, మితముగా మాట్లాడుతూ, అత్త మామల సేవ చేస్తూ, భర్తను దైవంగా భావిస్తూ ఉండేది. ఆవిడ ప్రవర్తనకు మెచ్చి వరలక్ష్మీదేవి కలలో కనిపించి శ్రావణ పూర్ణిమకు ముందుగా వచ్చే శుక్రవారం తనను పూజించమని సకల ఐశ్వర్యాలు లభిస్తాయని చెప్పి అంతర్ధానం అయ్యింది. మెలుకు వచ్చిన తర్వాత తన కల గురించి ఇంట్లో అందరికీ చెప్పి వరలక్ష్మిని పూజించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రావణ శుక్రవారం నాడు తనకు కలలో చెప్పిన విధంగా గోమయంతో అలికి ముగ్గులు పెట్టి పంచ పల్లవాల (మామిడి, రావి, మేడి, మర్రి మరియు జువ్వి చిగుళ్ళు) తో కలశస్థాపన చేసి, నాలుగు వర్ణాల వారితో కలిసి వరలక్ష్మీదేవిని పూజించి, తోరము కట్టుకొని వాయినాలు ఇచ్చింది. తర్వాత స్త్రీలందరితో కలిసి చారుమతి ప్రదక్షణ చేస్తుండగా మొదటి ప్రదక్షిణ పూర్తయ్యేసరికి అందరి కాళ్లకు అందెలు వచ్చాయి. రెండవ ప్రదక్షిణ పూర్తయిసరికి అందరి వంటిపై సర్వాభరణాలు వచ్చాయి. మూడవ ప్రదక్షిణ పూర్తయ్యేసరికి ఇళ్ల నుండి వారి వారి భర్తలు వారిని తీసుకపోవడానికి వాహనాలు తీసుకొని వచ్చారు. తమకింత భాగ్యం పట్టడానికి కారణం చారుమతి అని అందరూ ఆమెను పొగిడి, తమ ఇళ్లకు వెళ్లి, ప్రతి సంవత్సరం శ్రావణ పూర్ణిమాకు ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు చేసుకుని



అష్టైశ్వర్యాలతో తులతూగారు. ఇదీ చారుమతి సంక్షిప్త వృత్తాంతం.

**చారుమతి వ్యక్తిత్వంలోని విశిష్టత...**

ఈ వృత్తాంతంలో చారుమతి ఎలా ఉందో చూశాం కదా! గయ్యాళి కాకుండా, మితంగా, హితంగా, మధురంగా ,స్మిత వదనంతో మాట్లాడు తుంది. గయ్యాళి అసలే కాదు. అలాగని ఆమెకు మెతక దనము లేదు. కొంత గడుసుదనం ఉంది. స్త్రీకి గడుసుదనం చాలా అవసరం. లేకపోతే కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడం కష్టమవుతుంది. చారుమతి హితంగా, మితంగా, మధురంగా మాట్లాడుతుంది. అధిక ప్రసంగం చేయదు. అధిక ప్రసంగం అనేది కేవలం స్త్రీలకే కాదు. ఎవరికి ఉన్నా అది ఆమోదయోగ్యం కాదు. కుటుంబానికి కేంద్ర బిందువైన స్త్రీ తన కుటుంబానికి హితమైన మాటలే చెప్పాలి. హితమైన పనులే చేయాలి. చారుమతి భర్తను దైవంగా భావించేది. "దివ్య గుణాలున్న వారందరూ దైవ సమానులే!" అంటారు గీతాచార్యుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు. ఆనాటి పురుషులు కూడా భార్యల చేత దైవంగా పూజించబడ దానికి తగిన ప్రవర్తన కలిగి ఉండేవారు. ఒకవేళ కాకున్నా అతన్ని సవరించి సద్గుణవంతునిగా చేయగల సత్తా స్త్రీ మూర్తికి ఉండేది. అలాంటి స్త్రీలకు ప్రతినిధి మన కథ లోనిచారుమతి. ఇంకా అత్తమామలను తల్లిదండ్రుల వలె సేవించేది. విదేశీయులంతా భారత దేశం పట్ల గౌరవం కలిగి ఉండడానికి గల కారణాల్లో ప్రధానమైనది ఇదే! భారత స్త్రీని ప్రపంచంలో గౌరవ స్థానంలో నిలిపేది ఈ విధాలైన గుణగణాలే! తమ బాల్యం వారి ఒడిలో గడిచినట్లే వారి వృద్ధాప్యం తమ చేయూతతో గడపాలని ప్రతి సంతానం భావిస్తే ఆ పెద్ద వారికిఅది ఎంతో సంతృప్తిని ఇస్తుంది. ఇలాంటి సంతృప్తిని ఇవ్వగలిగే శక్తి కేవలం ఆ ఇంటి కోడలుకు మాత్రమే ఉన్నదని గమనించాలి.

**చారుమతిలోని ఆదర్శ లక్షణాలు..**

మిత భాషణం, మృదు భాషణం, సున్నిత స్వభావం, స్మిత వదనంతో భర్తను అత్తమామలను పలకరించడం, వారిని తగిన విధంగా గౌరవించడం అనే ఈ లక్షణాలు వరలక్ష్మీదేవికి బాగానచ్చి, స్వయంగావచ్చి, వరాలిచ్చి వెళ్ళింది. లక్ష్మీ అనుగ్రహం కావాలంటే ప్రతి గృహిణికి ఇవి ఎంతో అవసరం. లేకపోతే ఇంకెన్ని ఉన్నా వృథాయేయనని చెబుతోంది మనకు చారుమతి కథ. చారుమతిలో కనిపించే మరో ముఖ్యమైన సుగుణం స్వార్థం లేకపోవడం. వరలక్ష్మి తన ప్రవర్తనకు మిచ్చి తనను వ్రతం చేయమన్నది. కాని తాను ఒక్కతే వ్రతం చేయకుండా, అందరికీ చెప్పి తనతో పాటే అందరి చేత వరలక్ష్మి వ్రతం చేయించింది. అందరూ అంటే నాలుగు వర్ణాలకు చెందినటువంటి స్త్రీలు. అంటే పూజాదికాల విషయంలో కుల పట్టింపులు ఉండకూడదు అని నమ్మింది. ఆధునికులమని చెప్పుకునే మనం చారుమతి నుండి ఎంతో నేర్చుకోవాలి కదా!

**సనాతన ధర్మంలోని వైశిష్యం..**

పూజకు తమంతట తాము వచ్చిన స్త్రీలను ఇళ్లకు తీసుకొని వెళ్లడానికి వాహనాలతో వారి భర్తలు వచ్చారు. ఇది ఏ భార్య అయినా కోరుకునే సౌభాగ్యం. తన కోసం భర్త స్వయంగా రావటం వ్రతానికి ముందు లేని ప్రేమాభిమానాలు వ్రతం ముగిశాక ఇప్పుడు ఎక్కువయ్యాయి. వ్రత ఫలితాలకు ప్రధానమైనది ఇదే. నగలు సంపదల కన్నా ఒక స్త్రీ ఎక్కువగా కోరుకునేది భర్త ప్రేమాభిమానాలనే కదా! చారుమతి అందరితో కలిసి సహపంక్తి భోజనాలు చేసింది. వాయన దానం ఇచ్చింది. ఇవన్నీ సమాజంలో సామరస్యానికి దోహదపడుతాయి. ఇరుగుపొరుగు వారితో సత్సంబంధాలను పెంచుకునే పనులుగా మనం గ్రహించాలి. చారుమతి ఉత్తమ గృహిణులకు ప్రతినిధి. స్త్రీలందరూ చారుమతి వంటి మనసు ప్రవర్తన కలిగి ఉంటే తప్పకుండా వరలక్ష్మి దేవి అనుగ్రహం కలుగుతుంది. వర అంటే శ్రేష్టమైన. లక్ష్మీ అంటే సంపద లేదా గుర్తు. వరలక్ష్మి అంటే శ్రేష్టమైన సంపదకు గుర్తు అని అర్థం. చారుమతి లాంటి ఉత్తమ ఇల్లాలు కోరుకునే శ్రేష్టమైన సంపద భర్త అనురాగం మాత్రమే కాదు. కుటుంబం ఆనందం కూడా.. అందుకే ప్రతి మహిళ శ్రావణ మాసంలో వచ్చి ఏదైనా శుక్రవారం నాడు పూజ చేసి చారుమతి కథ చెప్పుకొని చారుమతి లాంటి ఉత్తమ గుణాలు కలిగిఉండాలని తెలుసుకోవాలి.అప్పుడే వరలక్ష్మీ దేవి స్వయంగా వారింట అడుగుపెట్టి అష్టైశ్వర్యాలను సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తుంది. ఇది మన సనాతన ధర్మంలోని విశిష్టత.



చౌడూరి నరసింహారావు
ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు

# పతనం దిశగా ప్రజాస్వామ్యం

అదుపు,నియంత్రణ,బలం,శక్తి,హింస, అణచివేత,కంటికి కన్ను పంటికి పన్ను లాంటి క్రూరమైన శిక్షలు, నిరంకుశత్వం, అణచివేత లాంటి అధికారాలు ఒకరిద్దరు లేదా ఒక చిన్న గుంపు/ ముఠా చేతిలో ఉండే అధికారం. ప్రపంచ వ్యాప్తంగా ఒకనాటి అన్ని పాలక వ్యవస్థలు ఇలాంటి అధికారాలనే కలిగి ఉండేవి. రాచరికాలు, నియంతృత్వ రాజ్య వ్యవస్థలు, మత పెద్దల గుప్పిట్లో ఉండే పాలక వ్యవస్థల్లో ఇలాంటి వారే పాలకులుగా ఉండేవారు. అలాంటి క్రూర వ్యవస్థలు అంతమై పోయి చాలా కాలమే గడిచి పోయింది.కొన్ని దేశాలో ఇలాంటి ఏక వ్యక్తి లేదా ఒక గుప్పెడు మంది ముఠా చేతుల్లో అధికారాన్ని చలాయించే రాజ్య వ్యవస్థలు 21 వ శతాబ్దంలో కూడా కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకొన్ని దేశాలు మిలి టరీ వ్యవస్థల నియంతృత్వం గుప్పిట్లో చిక్కుకొని ఉన్నాయి. మతం గుప్పిట్లో బంధీ అయిన దేశాలు కూడా ఇంకా ఉన్నాయి. ఇ లాంటి క్రూరమైన రాజ్య వ్యవస్థల్లో పౌరుల ఆలోచనలు, అభిప్రాయాలకు స్థానం లేదు, వారికి ఎలాంటి హక్కులు లేవు. ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం,స్వేచ్ఛ అసలే లేవు. ఉండే అవకాశాలు కూడా లేవు. యూఎన్ ఓ(ఐక్య రాజ్య సమితి) గుర్తించిన 196 సభ్య దేశాల్లో 50 వరకు ఇలాంటి రాజ్య వ్యవస్థలు కలిగినవి ఉన్నాయి. త్వరలో ఆ జాబితా లోకి చేరే దిశగా భారత రాజ్య వ్యవస్థ ప్రయాణం కొనసాగుతున్నది.మారుతున్న సామాజిక పరిస్థితుల్లో గడిచిన రెండు శతాబ్దాల కాలంలో అనేక దేశాలు ఎన్నికల వ్యవస్థలను నిర్మించుకొని వాటి ద్వారా రాజ్య వ్యవస్థలను నిర్మించుకుంటూ వస్తున్నాయి. యూరప్ లోని చాలా దేశాలు ఆసియా,ఆఫ్రికా ఖండాల్లోని కొన్ని దేశాలు ఎన్నికల ద్వారా పాలక వ్యవస్థ లను ఎన్నుకునే పద్ధతులను నిర్మించుకున్నాయి. యూరప్ లోని చాలా దేశాలు పూర్తి స్థాయి ప్రజాస్వామిక వ్యవస్థలుగా నిలదొక్కుకున్నాయి. 80 యేళ్లక్రితం పార్లమెంటరీ ప్రజాస్వామ్య నమూ నాను ఎంచుకున్న ఇండియా రాజ్య వ్యవస్థ పూర్తి స్థాయి ప్రజాస్వామ్యంగా ఇంకా ఎదగ లేదు.80 యేళ్ల కాలంలో ఈ దేశ ప్రజాస్వామ్యంఅనేక సవాళ్లనుఎదుర్కొంది. ఇండియాకు ఒక రోజు స్వతంత్రం పొందిన పాకిస్తాన్ లోఇప్పుడు నామమాత్రపు ప్రజాస్వామ్యం కూడా లేదు. అక్కడ ప్రజా పాలక వ్యవస్థ ఏర్పడే అవకాశాలు కనిష్ట మాత్రంగా కూడా లేవు. కానీ ఇండియా ప్రజాస్వామిక వ్యవస్థ కూడా పతనం దిశగా పయనించడం మొదలైంది.పదేళ్లుగా ఈ దేశ రాజ్య వ్యవస్థ ప్రజాస్వామిక స్వభావం క్షీణిస్తూ వస్తున్నది.ఇటీవల ఈ వేగం మరింత పెరిగిపోయింది.ఆధునికులు ప్రజాస్వామిక వాదులకు ఈ పతన వేగం పట్ల చాలా ఆందోళన కలిగిస్తున్నది. ప్రజాస్వామిక ప్రధాన లక్ష్యమైన అధికార వికేంద్రీకరణకు పూర్తిగా వ్యతిరేక దిశగా ఇప్పుడు ఈ దేశ రాజ్య వ్యవస్థ అడుగులు వేస్తున్నది, సరిగ్గా చెప్పాలంటే పరుగులు పెడుతున్నది. పాలనాధికారం అంతా గుప్పెడు మంది గుప్పిట్లో కేంద్రీకృతమౌతూ పోతున్నది.లెజిస్లేచర్, జ్యూడీషియరీల పని తీరు అధ్వాన్నంగా తయారైంది. దేశ ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు,ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ పని చేయవలసిన లెజిస్లేటర్ వ్యవస్థ నామమాత్రపు సమావేశాలను కేవలం మొక్కుబడి తంతుగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నది.ఎలాంటి చర్చా లేకుండానే అనేక కీలకమైన అంశాలపై చట్టాలను నిర్మిస్తున్నది. లెజిస్లేచర్ వ్యవస్థ ఇటీవల నిర్మించిన పలు చట్టాల్లో ప్రజాస్వామిక లక్షణాలు, స్వభావం ఏమీ కనిపించడం లేదు. విస్తృత ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించని చట్టాలు రాచరిక వ్యవస్థల్లో మాత్రమే నిర్మించ బడేవి,చెల్లుబాటయ్యేవి.కానీ ప్రజాస్వామ్యం అని ప్రకటించుకున్న ఈ దేశంలో కూడా అలాంటి చట్టాలే నిర్మితమౌతూ భారత సమాజాన్ని వెక్కిరిస్తున్నాయి. వ్యవస్థ నిర్మించే చట్టాలు, అది తీసుకునే అనేక విధాన నిర్ణయాల్లో ఇదే తీరు కనపడుతున్నది. ప్రజలు ఓట్లు వేసి అధికారం అప్పగించారు కాబట్టి తాము ఎవరికీ జవాబుదారీ కాదు అనే తీరును అధికార వ్యవస్థ ప్రదర్శిస్తున్నది. ప్రజాస్వామిక స్వభావం దాదాపుగా అంతమైపోయినా ఇది ప్రజాస్వామ్యమే అని అధికారం బెదిరిస్తున్నది.?250 యేళ్ల నాటి అమెరికా పాలకుడు కూడా ఇదే తరహా వ్యవహార శైలిని ప్రదర్శిస్తూ అమెరికన్లనే కాక అనేక దేశాలను ఇబ్బందుల పాల్జేసే అనేక మూర్ఖ నిర్ణయాలను తీసుకుంటూ పాలన సాగిస్తున్నాడు.అమెరికా ప్రజాస్వామ్యం ఆ దేశ అధ్యక్ష పదవికి ఇచ్చిన ప్రత్యేక అధికారాలతో ప్రస్తుత అధ్యక్షుడు అత్యంత మూర్ఖ నిర్ణయాలు తీసుకుంటూ అధ్యక్ష తరహా ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం పాల్జేస్తున్నాడు. అమెరికా వ్యవస్థ సంగతి ఏమిటో గాని,ఈ దేశ పాలక వ్యవస్థ తీసుకునే నిర్ణయాలు, రాజ్యాంగ వ్యవస్థలు పని చేస్తున్న తీరు వాటి పరిణామాలు మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థ భవిష్యత్తు మాత్రం ప్రశ్నార్థకంగా మారిందనే చెప్ప వలసి వస్తున్నది.



గోవర్ధన్ గంటే,
9347056621.



## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**విశ్వంభర, రామన్నపేట:** భారత మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న జగన్ మోహన్, వలిగొండ-రామన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్-చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా యువత రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచిన చారిత్రాత్మక నిర్ణయం రాజీవ్ గాంధీదే అని అన్నారు. దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు తీసుకెళ్లి, ఐటీ విప్లవానికి పునాదులు వేసిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని అభివర్ణించారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకుల ఓటరు నమోదును కార్యక్రమంను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి, రామన్నపేట ఉపసర్పంచ్ మోటే రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉద్దీపన వివిఎం స్కూలుకు డిజిటల్ బోర్డ్ అందజేత



**విశ్వంభర, రామన్నపేట:** నకిరేకల్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఉద్దీపన వివిఎం హైస్కూల్ కు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ రామన్నపేట లయన్స్ సభ్యులు మర్రి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో డిజిటల్ బోర్డును గురువారం పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని లయన్స్ క్లబ్ రామన్నపేట సేవలు అభినందనీయమన్నారు. పాఠశాలకు డిజిటల్ బోర్డును అందించడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ రామన్నపేట అధ్యక్షులు లయన్ డాక్టర్ పనకంటి భాస్కరరావు, కోశాధికారి లయన్ గండ్ల నరేందర్ రెడ్డి, రీజియన్ చైర్-పర్సన్ లయన్ సంజీవరెడ్డి సిరిగిరెడ్డి, యాపాల కృష్ణారెడ్డి, గుత్తా నరసింహారెడ్డి, కళ్లెం అనంతరెడ్డి, లైన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్, సెంటినల్ క్లబ్, నవ్యా క్లబ్ అధ్యక్షుడు కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి



**విశ్వంభర, కె.పి.హెచ్.బి:** కూకట్‌పల్లి పరిధిలోని కె.పి.హెచ్.బి ఫోరంలో స్వర్గీయ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కమ్మ సంఘం అధ్యక్షుడు బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

## రామన్నపేటలో సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్



**విశ్వంభర, రామన్నపేట:** ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 12న యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని కోర్టుల న్యాయ పరిధిలో నిర్వహించనున్నట్లు సంబంధిత న్యాయాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి-కం- మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.సబిత మాట్లాడుతూ, రామన్నపేట కోర్టుల న్యాయ పరిధిలోని కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీ చేసుకునే అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకింగ్, ఆర్థిక వివాదాలు, మోటార్ వాహన ప్రమాద పరిహారం కేసులు తదితర కేసులను ఇరుపక్షాల సమ్మతితో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు, వివాదాలకు స్నేహపూర్వకంగా, త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు, లోక్ అదాలత్ పరిధిలో పరిష్కరించదగిన వివాదాలను కూడా సంబంధిత న్యాయవాదుల సహకారంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చున్నారు. కావున రామన్నపేట కోర్టుల న్యాయ పరిధిలోని కక్షిదారులు, న్యాయవాదులు, ప్రజలు తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునేందుకు తేది:12-09-2026న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారులు కోరారు.

## ఎల్-నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన



**విశ్వంభర , హుస్నాబాద్ :** వాతావరణ మార్పులు, ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్‌లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణపై హుస్నాబాద్ మండల రైతులకు అవగాహన కల్పించారు. గురువారం హుస్నాబాద్ రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుకు మండల ప్రత్యేక అధికారి కొండల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలతో పాటు వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమున్న వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ప్రోత్సహించాలన్నారు. నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని కందులు, మినుములు, సజ్జ, రాగి, ఆముదం, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకునేందుకు ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణలో భాగంగా వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు వివిధ ప్రోత్సాహకాలు అందిస్తున్నందున, ప్రస్తుత నీటి పరిస్థితుల్లో అది రైతులకు దీర్ఘకాలికంగా లాభదాయకంగా ఉండే అవకాశం ఉందన్నారు. సింగిల్ విండో , మార్కెట్ కమిటీ, మున్సిపల్ చైర్మన్లు మాట్లాడుతూ నీటి వనరులను సంరక్షించుకుంటూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అధికారుల సూచనలు పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్న రాజు, వి.వెంకటరమణ, కౌన్సిలర్లు, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## సమాచారం ఇవ్వకుండా గోడ కూల్చివేత

### రోడ్డు విస్తరణపై బీఆర్ఎస్ ఆగ్రహం



**విశ్వంభర , హుస్నాబాద్:** రోడ్డు విస్తరణ పేరుతో ప్రజలకు సమాచారం ఇవ్వకుండా ఇళ్ల ప్రహరీ గోడలను కూల్చివేయడం సరికాదని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జునరెడ్డి అన్నారు. ఎల్లమ్మబజార్ రోడ్డులో బోడ ఎల్లారెడ్డి ఇంటి ప్రహరీ గోడను మున్సిపల్ అధికారులు బుధవారం సాయంత్రం కూల్చివేశారని ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. మల్లెచెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వరకు 70 అడుగుల మేర రోడ్డు విస్తరణకు మున్సిపల్ పాలకవర్గం నిర్ణయించిందన్నారు. అయితే 60 అడుగులకే పరిమితం చేయాలని స్థానికులు కోరుతున్నారని తెలిపారు. రోడ్డు విస్తరణకు సంబంధించి అధికారులు మార్కింగ్ చేసిన మేరకు పలువురు బాధితులు స్వచ్ఛందంగా నిర్మాణాలను తొలగించుకుంటున్నారని చెప్పారు. అయినప్పటికీ ఇంటి యజమానులకు కనీస సమాచారం ఇవ్వకుండా గోడలను కూల్చివేయడం వల్ల వారు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని అక్రమ లేఅవుట్లపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలు తీసుకుంటున్న మున్సిపల్ కమిషనర్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాలకవర్గానికి అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను మాత్రం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, మాటూరి రాజశేఖర్‌గౌడ్, బత్తుల కొమురయ్య, ఇంటి యజమాని బోడ ఎల్లారెడ్డితో పాటు కాలనీవాసులు తదితరులు న్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

### హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి



**విశ్వంభర , హుస్నాబాద్ :** హుస్నాబాద్ పట్టణంలోని 14వ వార్డులో పురపాలక సంఘం చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో 'సఫాయి అప్నా భీమారీ భగావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టీ.మల్లికార్జున్, కౌన్సిలర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పట్టణ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పాత టైర్లు, కుండలు, డ్రమ్ములు తదితర వాటిలో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలన్నారు. చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని, డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. స్వచ్ఛతను పాటిస్తూ ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూరుగు లత, కొండ రజిత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు,సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, బత్తుల స్వరూప, కోఆప్షన్ సభ్యులు సరోజన, గ్లోరినా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రవికుమార్, జవాన్ సారయ్య, ప్రభాకర్, శ్రీకాంత్ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలి

### ఆగస్టు 31న ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

### సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు



**విశ్వంభర, గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించి, పనులను పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించే పాదయాత్రను, ఆగస్టు 31న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం గుండాల చౌరస్తాలో రైతులతో కలిసి మద్దెపురం రాజు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తవుతున్నా సాగునీటి ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం విచారకరమన్నారు. గుండాల మండలంలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, వేలాది మంది చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మండలానికి కీలకమైన నవాబుపేట రిజర్వాయర్, కాలువ నిర్మాణ పనులతో పాటు భూసేకరణ, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు పూర్తి చేసి సాగునీరు అందించడంలో 23 ఏళ్లుగా ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు వెంటనే నిధులు విడుదల చేసి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఆగస్టు 31న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మద్దెపురం రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బత్తిని బిక్షం, యండి. ఖలీల్, రైతులు ముత్యం యాదయ్య, రామ్మల్లు, నరాముల ఎల్లయ్య, రాములు, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవలో మూడు దశాబ్దాలు.. ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామికి గురు పురస్కారం



**విశ్వంభర, చేవెళ్ల:** అయ్యప్ప స్వామి సేవలో మూడు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్న చేవెళ్ల మండలం కందవాడ గ్రామానికి చెందిన ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామి ప్రతిష్ఠాత్మక గురు పురస్కారానికి ఎంపికయ్యారు. మహాశాస్త్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరిగే గురు పురస్కార మహోత్సవంలో ఆయనను సత్కరించనున్నారు. మహాశాస్త్ర సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాజు గురుస్వామి మాట్లాడుతూ, ఉమాశంకర్‌రెడ్డి గత మూడు దశాబ్దాలుగా అయ్యప్ప దీక్షను కొనసాగిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా శబరిమల మకరజ్యోతి దర్శనం చేసుకోవడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పడిపూజలు, ఇరుముడి కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వాములకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా కందవాడ నుంచి స్వాములతో కలిసి మహాపాదయాత్రగా శబరిమలకు వెళ్తున్నారని తెలిపారు. ఉమాశంకరరెడ్డి గురుస్వామి మాట్లాడుతూ, 1995లో తొలిసారి అయ్యప్ప దీక్ష తీసుకున్నానని, స్వామివారి కృప ఉన్నంతకాలం చివరి శ్వాస వరకు అయ్యప్ప సేవలో కొనసాగుతానని అన్నారు. తనకు లభించిన గురు పురస్కారాన్ని గురుస్వాములు, స్వాములు, భక్తులందరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

## మండల స్కూల్ బస్ డ్రైవర్ల నూతన కమిటీ ఎన్నిక



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రం లోని స్థానిక ప్రైవేటు పాఠశాలల బస్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమమే ధ్యేయంగా నూతన యూనియన్ కమిటీ కొలువుదీరింది. శనివారం రోజు రామన్నపేటలో నిర్వహించిన ప్రైవేటు పాఠశాలల బస్ డ్రైవర్ల ప్రత్యేక సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఈ కమిటీని ఎన్నుకున్నారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పోరాడేందుకు, ఒకరికొకరు బాసటగా నిలిచేందుకు ఏకతాటిపైకి వచ్చినట్లు సభ్యులు తెలిపారు. అనంతరం కొత్తగా ఎన్నుకోబడిన బాధ్యుల పేర్లను ప్రకటించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడు బి.లింగస్వామి, ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్, కార్యదర్శి వెంకన్న, సహాయ కార్యదర్శి అవనిగడ్డ వెంకటేశ్వర్లు, కోశాధికారి బత్తుల నవీన్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల బస్ డ్రైవర్ల హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఎ.నరసింహ, జి.శాంతి కుమార్, బి.వెంకన్న, ఎన్.మహేష్, బి.సుధాకర్, ఎన్.నరసింహ, ఎస్.మహేష్, పి.మహేష్, బి.శ్రీరామ్, ఎ.వేణుగోపాల్, డి.జగతి, కె.బిక్షపతి, ఎన్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పరిగిలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు




**విశ్వంభర, పరిగి:** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు జి. రామకృష్ణ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన దేశంగా తీర్చిదిద్దేందుకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సాంకేతిక రంగం, టెలికమ్యూనికేషన్స్, విద్య, యువత, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి రంగాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశాయని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన అభివృద్ధి మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల రజిత వెంకటేష్, వైస్ చైర్మన్ కమల్, దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాంత కుమార్, దోమ పిఎసిఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, పరిగి పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజు పుల్లారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్స్ యూసుఫ్,అయుబ్, ఆరిఫ్, ఎజాజ్ కోఆప్షన్ సభ్యులు ఆంజనేయులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఫిరంగి వెంకట్రాంరెడ్డి, మైపాల్,సుల్తాన్, విట్టల్, ఆనంద్, నర్సింలు, అశోక్, వెంకటేష్, నాగరాజు మహిళా కాంగ్రెస్ నాయకురాలు రజితా రెడ్డి, లక్ష్మి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదల శాఖ మోతే మండల లస్కర్ల యూనియన్ ఎన్నిక

**విశ్వంభర, మోతే:** మోతే మండలం లస్కర్ యూనియన్ అధ్యక్షునిగా చుండూరి లక్ష్మీనరసింహ ని, ఉప అధ్యక్షులుగా ఉప్పునూతల నరేష్ ని , ప్రధానకార్యదర్శిగా కొల ఉపేందర్ కోశాధికారిగా బోడు శివను సూర్యాపేట లష్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వంశి క్రిష్ణ గారి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులు చుండూరి లక్ష్మీనరసింహగారు మాట్లాడుతూ లస్కర్ అందరూ కలిసి తనను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ మరియు వారికి విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని తెలియజేయడం జరిగింది.





## నేడు ఇనుగుర్తి లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
## శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి

**విశ్వంభర, ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని చారిత్రక మహిమాన్విత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు తిరునహరి కృష్ణమాచార్యులు తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడిస్తూ నేడు (శుక్రవారం) ఉ. 11-0గం.కు అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం ప్రారంభమవుతుందన్నారు.ఏ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.వరలక్ష్మీ వ్రతం శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే పవిత్రమైన హిందూ పండుగ అని విషదీకరించారు.వరలక్ష్మీదేవిని పూజిస్తే అష్టలక్ష్మి (ధాన్యం, ధైర్యం, సంతానం, విజయం, విద్యా, ధనం, గజ, సౌభాగ్య లక్ష్మి)లను పూజించినట్లేనని వివరించారు.ఈ వ్రతం ఆచరించడం ద్వారా సిరుల తల్లి కటాక్షంతో ఇంట్లో సుఖసంతోషాలు, ధనధాన్యాలు వెల్లివిరుస్తాయని చెప్పారు.వివాహిత మహిళలు తమ కుటుంబ శ్రేయస్సు కోసము, భర్త ఆయురారోగ్యాలతో వర్ధిల్లి దీర్ఘకాలం సుమంగళిగా ఉండాలని వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేస్తారన్నారు.ఈ పవిత్రమైన వరలక్ష్మీ వ్రతంలో ఇనుగుర్తి పట్టణంతో పాటు పరిసర గ్రామాల మహిళలందరూ పాల్గొని వ్రతాన్ని ఆచరించాల్సిందిగా కోరారు.వరలక్ష్మి వ్రతంలో పాల్గొనేవారు సంబంధిత పూజా ద్రవ్యాలను ఎవరికివారు తీసుకురావాలని తెలిపారు.

## సాగునీటి కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : ఎర్రబెల్లి దయాకర్‌రావు



**విశ్వంభర, జనగామ :** దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామ లో సాగునీటి కోసం జనగామ సూర్యాపేట ప్రధాన రహదారి పై జిల్లా నాయకులు పళ్ళ సుందర్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో కార్యకర్తలకు రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రోడ్డుపై నిరసన తెలపగా పోలీసులు ఎర్రబెల్లి దయాకర్ రావుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి విడుదల చేయకపోతే సాగునీటి కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, సీనియర్ నాయకులు ఏల సోమ సుందర్,మండల నాయకులు సుడిగాల హనుమంతు, పలు గ్రామాల సర్పంచులు రైతులు కార్యకర్తలు యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కాజీపేట, కొత్తగూడెంలను రైల్వే డివిజన్లుగా అభివృద్ధి చేయాలి: ఎంపీ వద్దిరాజు



**విశ్వంభర, మహబూబాబాద్:** కాజీపేట జంక్షన్, కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్లను డివిజన్ కేంద్రాలుగా ప్రకటించి అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్‌లో జరిగిన దక్షిణ మధ్య రైల్వే జోనల్ పరిధి ఎంపీల సమావేశంలో జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. భద్రాచలం వరకు రైల్వే మార్గాన్ని విస్తరించి, భవిష్యత్తులో పలు రాష్ట్రాలకు అనుసంధానించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఖమ్మం, కొత్తగూడెం, మధిర, మహబూబాబాద్ తదితర రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు లిఫ్టులు, ఎస్కలేటర్లు, సీసీటీవీ కెమెరాలు, అండర్‌పాస్‌లు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఖమ్మం స్టేషన్‌లో అధిక పార్కింగ్ ఫీజులను నియంత్రించాలని, కొత్తగూడెం నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నడపాలని, కోవిడ్‌కు ముందు నడిచిన కాజీపేట--మణుగూరు ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని కోరారు. మధిర, మహబూబాబాద్, గార్ల, కేసముద్రం, నెక్కొండ స్టేషన్లలో పలు ముఖ్య రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాజీపేట--డోర్నకల్--విజయవాడ మార్గంలో డెము ప్యాసింజర్ రైలు పునరుద్ధరణతో పాటు నిజామాబాద్ రైల్వే బైపాస్ లైన్ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని ఎంపీ వద్దిరాజు అధికారులను కోరారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**విశ్వంభర, చందానగర్ :** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు చందానగర్ డివిజన్ గంగారంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, భారతదేశానికి 7 వ ప్రధానిగా సేవలందించిన మానీయుడు , దేశానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందించిన మొదటి ప్రధానిగా చరిత్ర సృష్టించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు ముఖ్య నాయకులు భారీగా పాల్గొన్నారు.




## దివ్యాంగుల హక్కుల చట్టం-2016 అమలుకు డీజీపీకి వినతి



**విశ్వంభర, రామన్నపేట:** దివ్యాంగుల హక్కుల చట్టం--2016ను పోలీస్ శాఖలో సమర్థవంతంగా అమలు చేయాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలానికి చెందిన డాక్టర్ ఎన్.అశోక్ ఆధ్వర్యంలో డీజీపీని కోరింది. హైదరాబాద్‌లో డీజీపీని కలిసి దివ్యాంగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో బెంచ్‌మార్క్ దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేసి, పోలీస్ శాఖలో అనుకూలమైన ఉద్యోగాలను గుర్తించాలని, బ్యాక్‌లాగ్ ఖాళీలను ప్రత్యేక నియామకాల ద్వారా భర్తీ చేయాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో చట్టంలోని సెక్షన్లు 89, 91, 92పై అవగాహన బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ర్యాంపులు, అందుబాటులో ఉండే ఫిర్యాదు సదుపాయాలు కల్పించాలని, దివ్యాంగులపై వివక్ష, అవమానం, వేధింపులు, హింస, దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, దివ్యాంగుల ఫిర్యాదులను సులభంగా స్వీకరించేందుకు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, అవసరమైన చోట సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రెటర్లు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రతి జిల్లా కేంద్రంలో "దివ్యాంగుల హక్కులు--పోలీసుల బాధ్యతలు"పై అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరింది. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నెలకు ఒకసారి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఫోరం అభ్యర్థించింది. దివ్యాంగులకు రక్షణ, గౌరవం, సమానత్వం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ పోలీస్ శాఖ ఆదర్శంగా నిలవాలని కోరింది. డీజీపీ సానుకూలంగా స్పందించి చట్టం అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షులు కుర్షిద్ మియా, మహిళా అధ్యక్షురాలు ధనమ్మ, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలు మెరుగుపరచాలి
### గుండాల జెడ్‌పీహెచ్ఎస్‌లో కాంప్లెక్స్ స్థాయి సమావేశం



**విశ్వంభర, గుండాల:** విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు ప్రాథమిక స్థాయిలో వారి మౌలిక అభ్యసన సామర్థ్యాలు (ఎఫ్ఎల్ఎన్) మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారి అగ్గి రాములు సూచించారు. బుధవారం గుండాల జెడ్‌పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు సమర్థవంతమైన బోధనా పద్ధతులు అవలంబించాలని ఆయన కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ మాట్లాడుతూ, బోధన--అభ్యసన సామగ్రిని వినియోగిస్తూ విద్యార్థులకు ఆసక్తికరంగా బోధించడం ద్వారా ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ సహాయక బృందం నోడల్ అధికారి రవి కిరణ్ మాట్లాడుతూ, ప్రతి ప్రాథమిక పాఠశాలలో బోధన-అభ్యసన సామగ్రి, పాఠ్య ప్రణాళికలను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థుల వర్క్‌బుక్కుల నిర్వహణ, బోధన పరిశీలన, అక్కడికక్కడే మూల్యాంకనం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బృంద సభ్యులు వనం వెంకటేశ్వర్లు, సత్తి రెడ్డి, ఆర్పీ జంపాల రాజు, సీఆర్‌పీ దేవనబోయిన లింగయ్యతో పాటు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 31న ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి



**విశ్వంభర, మోత్కూర్:** జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేసి, పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆగస్టు 29, 30, 31 తేదీల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి తెలిపారు. ఆగస్టు 31న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం మోత్కూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం బొల్లు యాదగిరి మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడి దశాబ్దం గడుస్తున్నా ఇప్పటివరకు జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదని విమర్శించారు. జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, లక్షలాది మంది చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఆత్మకూరు, మోత్కూర్, అడ్డగూడూరు మండలాలకు సాగు, తాగునీరు అందించే బునాదిగాని కాలువ పనులను పూర్తి చేసి నీటిని అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న పాదయాత్రను, ఆగస్టు 31న ఇందిరాపార్క్‌లో జరిగే మహాధర్నాను రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల యాదిరెడ్డి, సీపీఎం సీనియర్ నాయకులు కూరపాటి రాములు, ఎన్నం వెంకట్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు పానుగుల రమేష్, అరిగె బుచ్చయ్య, నరిగె రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ రూపా రెడ్డి హత్యను ఖండించిన మాస్టర్ మైండ్స్ ఈ టెక్నో స్కూల్ కరస్పాండెంట్ నవనీత



**విశ్వంభర, సంగారెడ్డి:** నల్గొండ జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ప్రిన్సిపల్ గా పని చేస్తున్న రూపా రెడ్డిని పదవ తరగతి విద్యార్థులు అత్యంత పాషవికంగా హత్య చేసిన ఘటనపై సంగారెడ్డిలోని మాస్టర్ మైండ్స్ ఈ టెక్నో స్కూల్ కరస్పాండెంట్ నవనీత తీవ్రంగా ఖండించారు. చదువుకునే విద్యార్థులే ప్రిన్సిపాల్ ను హత్య చేయడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఈ విషయంపై మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు క్రమశిక్షణగా ఉన్నారా లేదా అని గమనించడం వారి బాధ్యత అని తెలిపారు. పిల్లలకి సెల్ ఫోన్ ఇవ్వడం, డబ్బులు ఇవ్వడం, బైక్ ఇవ్వడం తప్పు అని అన్నారు. మొక్కయి వంగనిది మానై వంగునా అనే సామెతను గుర్తు చేస్తూ పిల్లలకు చిన్నతనంలోనే క్రమశిక్షణ, సంస్కారం నేర్పితే ఇలాంటి ఘటనలు జరగవని ఆమె అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు అసలు సమయం కేటాయించక పోవడం, తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయాన్ని గమనించకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు సంభవిస్తున్నాయని అన్నారు. చిన్నతనంలోనే చెడు అలవాట్లకు బానిసలుగా మారి తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారంగా మార్చుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పిల్లల తల్లిదండ్రులు,స్కూల్లో ఉపాధ్యాయులు పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని వారికి క్రమశిక్షణతో పాటు వ్యక్తిత్వ వికాసం, మానసిక దృఢత్వం,యోగా వంటి పలు కీలక అంశాలపై దృష్టి సారించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని ఆమె ఆకాంక్షించారు.

## రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



**విశ్వంభర , హుస్నాబాద్ :** మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్‌గాంధీ బాటలు వేశారని అన్నారు. యువతకు మార్గదర్శకుడిగా నిలిచిన ఆయన ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను ప్రజాస్వామ్య నిర్మాణంలో భాగస్వాములను చేశారని తెలిపారు. దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. 73, 74వ రాజ్యాంగ సవరణలతో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాహిత కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి.వెంకటరమణ, వెన్నరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డిండిలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలో ని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. వృద్దులకు పండ్లు, బ్రెడ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల శశిధర్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డమీది సాయి, మాజీ ఉప సర్పంచ్ పోలం లక్ష్మణ్, ప్రవీణ్ రెడ్డి. సైదులు, ఖలీమ్, నూకం చంద్రయ్య, బాలయ్య. శ్రీనివాస్ గౌడ్, సలయ., మాధవ్ గౌడ్, కృష్ణ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు భయపడాల్సిన అవసరం లేదు



**విశ్వంభర, సూర్యాపేట:** ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, శస్త్రచికిత్సలంటేనే ప్రమాదకరమనే అపోహను ప్రజలు వీడాలని యశోద ఆసుపత్రి సోమాజిగూడ థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, క్షయవ్యాధి వల్ల ఊపిరితిత్తులు దెబ్బతినడం, దగ్గులో రక్తం పడటం వంటి సమస్యలకు ఆధునిక చికిత్సలు, శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ థొరాసిక్ సర్జరీల ద్వారా చిన్న కోతలతోనే చికిత్స చేసి రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉందన్నారు. ఎండ్ స్టేజ్ లంగ్ డిసీజ్‌తో బాధపడుతున్న వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కొత్త జీవితాన్ని అందించే అవకాశముందని చెప్పారు. సరైన సమయంలో నిపుణులైన వైద్యులను సంప్రదిస్తే మెరుగైన చికిత్స పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయం గుడికి మద్రు అయోధ్య రామయ్య రూ. 80 వేల విరాళం



**విశ్వంభర, మోతే :** మోతే మండలం రాఘవపురం ఎక్స్ రోడ్ రామాలయం గుడికి 80 వేల రూపాయలతో దివంగత మద్రు సావిత్రమ్మ పేరు మీద ఆమె భర్త మద్రు అయోధ్య రామయ్య రామాలయం గుడిలో భక్తుల విశ్రాంతి కోసం రెండు గదులు నిర్మించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల లింగయ్య గౌడ్. మద్రు సతీష్ కుమార్. కా రింగుల జానయ్య. కోల రవీందర్ గౌడ్.గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కారుపోతుల అంజన్న సేవలు చిరస్మరణీయం



**విశ్వంభర, రామన్నపేట:** ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజానాట్య మండలి మాజీ జిల్లా అధ్యక్షులు, ప్రజా కళాకారులు కామ్రేడ్ కారుపోతుల అంజన్న 31వ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కక్కిరేణి గ్రామంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు గంటెపాక శ్రీకృష్ణ, మండల అధ్యక్షులు బర్రె మధు మాట్లాడుతూ, ప్రజా కళాకారుడిగా కారుపోతుల అంజన్న ప్రజా సమస్యలను తన కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారని అన్నారు. సమాజంలోని అన్యాయాలు, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు ఆయన కళను ఒక ఆయుధంగా ఉపయోగించారని పేర్కొన్నారు. "కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం" అనే ఆశయంతో ప్రజల కోసం తన కళను అంకితం చేసిన అంజన్న సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ప్రజా కళాకారులకు ఆయన జీవితం, పోరాట స్ఫూర్తి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. నేటి కళాకారులు కూడా ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజ మార్పు కోసం తమ కళను వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సభ్యులు మజ్జూరి సాయి, రామన్నపేట మండల కమిటీ సభ్యులు కానుకుంట్ల ఉప్పలయ్య, మచ్చగిరి, వెంకన్న, లింగస్వామి, చరణ్, లోకేష్, బూడిద ఆది తదితరులు పాల్గొని కామ్రేడ్ కారుపోతుల అంజన్నకు ఘన నివాళులు అర్పించారు.



# రూ.71 లక్షల స్వీపింగ్ మెషిన్ మాయమైందంటూ బీజేపీ ధర్నా

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల శుభ్రత కోసం రూ.71 లక్షల ప్రజాధనంతో కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఉన్న స్వీపింగ్ మెషిన్ కనిపించడం లేదంటూ భారతీయ జనతా పార్టీ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. 53, 56 డివిజన్ల అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదిభట్ల, రాగన్నగూడ సర్కిల్‌లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం స్వీపింగ్ మెషిన్ కొనుగోలు చేసినప్పటికీ, ఇప్పటివరకు అది మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా పనిచేసినట్లు కనిపించలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. మెషిన్ కొనుగోలు, నిధుల వినియోగంపై పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాధనంతో కొనుగోలు చేసిన మెషిన్ ఎక్కడ ఉందో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నారాయణ యాదవ్, నోముల దయానంద్ గౌడ్, కొత్త అశోక్ గౌడ్, కొత్త రాంరెడ్డి, బచ్చిగళ్ల రమేష్, కొంద్రు పురుషోత్తం, కరాడి శ్రీలత, అనిల్, బీజేపీ సీనియర్ నాయకులు అర్జున్ గౌడ్, బల్‌దేవ్ రెడ్డి, డి. యూసుఫ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డి. గుండదాసు, పాపయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నైపుణ్యాల వికాసానికి సైన్స్ ఫెయిర్



**విశ్వంభర, ఉప్పుగూడ:** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్‌లు, ఆదర్శ నాయకుల కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని శ్రీ సరస్వతి శిశు మందిర్, తానాజీ నగర్ ప్రిన్సిపల్ లావణ్య తెలిపారు. ఉప్పుగూడలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల్లో సదాచారం, నైతిక విలువలు పెంపొందించడంతో పాటు కుటుంబ పరిస్థితులు, భారతీయ ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించడం పాఠశాల ప్రధాన లక్ష్యమన్నారు. 1982లో 52 మంది విద్యార్థులతో ప్రారంభమైన శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రస్తుతం 252 మంది విద్యార్థులతో విద్యా సేవలు అందిస్తోందని తెలిపారు. పాఠశాలకు సువిశాలమైన ప్రాంగణం ఉండటం వల్ల విద్యార్థుల ఆటలు, కళా నైపుణ్యాల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠశాల నిరంతరం కృషి చేస్తోందని ప్రిన్సిపల్ లావణ్య తెలిపారు.

# నెల్లికుదురులో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**విశ్వంభర, నెల్లికుదురు:** మండల కేంద్రం నెల్లికుదురు లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఎదళ్ల యాదవ రెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు.స్థానిక సర్పంచి పులి వెంకన్న,పార్టీ మాజీ మండల అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ ప్రభృతులతో కలిసి రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ..దేశంలో టెక్నాలజీ,టెలికాం రంగం, కంప్యూటర్ విప్లవం,ఓటు హక్కు వయసు 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించిన గొప్ప నేత రాజీవ్ అన్నారు. గ్రామాల్లో స్థానిక స్వపరిపాలనకు పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి తో పాటు,పేదలకు నాణ్యమైన విద్య అందించడానికి నవోదయ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మండల గ్రామ నాయకులు బాలాజీ నాయక్, మద్ది రాజేష్, నాయిని శ్రీపాల్ రెడ్డి,పత్తిపాక తిరుపతాచారి, మల్లేశం,యాకుబ్ రెడ్డి,యాసం యాకన్న,వరిపెల్లి పూర్ణచందర్,యుగేందర్, వెన్నం క్రాంతి రెడ్డి,కల్వకుంట్ల మౌనేందర్,బక్కి రెడ్డి,చంద్రు,టైలర్ యాకన్న,ప్రవీణ్,పెరుమాండ్ల జగన్,అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు, ఇంటి స్థలం లేని పేదలకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలి

## పేదల సమావేశంలో కార్మిక సంఘం నాయకుల డిమాండ్

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** ప్రభుత్వానికి ఇంటి స్థల పట్టా ధ్రువపత్రాలు అప్పగించిన నిరుపేదలందరికీ వెంటనే రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయాలని, ఇల్లు, ఇంటి స్థలం లేని అర్హులైన పేదలకు ప్రభుత్వ భూమి కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని టి ఎఫ్ టి యూ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక సంఘం కార్యాలయంలో ఇల్లు, ఇంటి స్థలం లేని పేదలు, రెండు పడక గదుల ఇళ్ల బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టా ధ్రువపత్రాలు అప్పగించి ఏళ్లు గడుస్తున్నా చాలామందికి ఇళ్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పడక గదుల ఇళ్ల మంజూరులో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2018లో ప్రభుత్వ హామీ మేరకు పట్టా ధ్రువపత్రాలు అప్పగించిన సుమారు 888 మందిలో కేవలం 100 మందికే ఇళ్లు మంజూరయ్యాయని, మిగిలిన అర్హులందరికీ వెంటనే ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఇంటి స్థలం లేని పేదలకు 133 చదరపు గజాల ప్రభుత్వ భూమి కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, ఇళ్ల బాధితులు, పేదల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**విశ్వంభర, మహబూబాబాద్:** ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కింద మంజూరైన నిధులను ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమానికే వినియోగించాలని, నిధులను పక్కదారి మళ్లిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. గురువారం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలను సందర్శించిన అనంతరం ఐడీఓసీలో ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు, హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ శబరిష్, అదనపు కలెక్టర్లు కె. అనిల్ కుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని చైర్మన్ సూచించారు. అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడంలో జాప్యం ఉండకూడదన్నారు. తీవ్ర నేరాల బాధిత కుటుంబాలకు పరిహారంతో పాటు ఉపాధి, గృహ వసతి, పునరావాస సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉద్యోగుల పదోన్నతుల్లో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో పంచాయతీ లేదా సీఎస్ఆర్ నిధులతో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎస్సీ, ఎస్టీల ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. విదేశీ విద్య, బాధితులకు పరిహారం, కులాంతర వివాహ ప్రోత్సాహకాలకు సంబంధించిన పెండింగ్ అంశాలపై నివేదిక అందించాలని ఎస్సీ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. కమిషన్ సూచనల మేరకు ఇళ్ల కేటాయింపు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్, అంబేద్కర్ భవనం నిర్మాణం, గిరిజన డిగ్రీ కళాశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

## వలిగొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా



**విశ్వంభర, వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ గద్దెనెక్కిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం,రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామిలు అన్నారు . సిపిఎం, ఆధ్వర్యంలో వలిగొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ధర్నా నిర్వహించిన అనంతరం తహసిల్దార్ దశరథ నాయక్ కు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల కాలంలో ఉద్యోగాలను భర్తీ చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పోరాడుతుంటే వారిపై దేశద్రోహులని ముద్ర వేసేందుకు కుట్ర చేస్తుందన్నారు ప్రస్తుతం దేశంలో 1 కోటి 83 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని ఒక్క రైల్వే డిపార్ట్మెంట్ లోనే 1.08 లక్షల పోస్టులు ఖాళీలు ఉన్నాయని వీటన్నిటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో 2 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని ఉన్నాయని తాము అధికారంలోకి వస్తే రెండేళ్లలో ఖాళీ పోస్టులన్నిటిని భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ వాటిని భర్తీ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు, డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచంద్రర్, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య, వేముల చంద్రయ్య ,శీలం ఇందిర,వేముల లక్ష్మయ్య,గంగాపురం వెంకటేశం, మైసోల్ల నరేందర్, దొడ్డి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సీతారాం రెడ్డికి సిపిఎం ఘన నివాళి



**విశ్వంభర, నెల్లికుదురు:** దివంగత సీతారామరెడ్డి ప్రథమ వర్ధంతిని నెల్లికుదురు మండలం పంజర గ్రామంలో ఆయన తనయుడు మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి స్వగృహంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దీనికి సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు హాజరై సీతారామరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కా.సీతారాం రెడ్డి నిరంతరం బానిసత్వానికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన నేత అని కొనియాడారు.అంటరాని తనానికి వ్యతిరేకంగా భూమి, భుక్తి,విముక్తి కోసం,వెట్టిచాకిరికి వ్యతిరేక గా ఉద్యమించాడన్నారు. దున్నేవారికి భూమి పంచాలని భూస్వామ్య పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో మడమ తిప్పలేదన్నారు.తుది శ్వాస విడిచెంతవరకు కమ్యూనిస్టు కార్యకర్తగా నాయకునిగా ఎర్రజెండా మార్గంలో నడిచిన కమ్యూనిస్టు సిద్ధాంతి అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నెలకుర్తి వెంకటరెడ్డి,స్వరూప,గుండెపాక నరసయ్య,బండ వెంకన్న, దేవేందర్,జె.వెంకటరత్నం,గుగులోతు శ్రీనివాస్,కొత్త లక్ష్మి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలి : వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చైర్మన్ గంట



**విశ్వంభర, కేసముద్రం:** కేసముద్రం మున్సిపాలిటీ మార్కెట్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ... యువతపై నమ్మకంతో ఓటు హక్కు వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి ప్రజాస్వామ్యంలో యువతకు భాగస్వామ్యం కల్పించారని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, నూతన విద్యా విధానం, ఐటీ, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. అత్యంత చిన్న వయస్సులోనే ప్రధాని అయ్యిన ఘనత మన రాజీవగాంధీ గారిది అని,దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ గారి సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన చూపిన దూరదృష్టి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శ్రీలంకలో శాంతి స్థాపనకు కృషి చేసిన రాజీవ్ గాంధీ గారు 1991లో శ్రీపెరంబుదూరులో ఎల్‌టీటీఈ మానవ బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు.నవ భారత నిర్మాణానికి కంప్యూటర్ యుగాన్ని పరిచయం చేసి ఈ రోజు భారతదేశ యువత ప్రపంచ నలుమూలల అగ్రగామిలో ఉండేలా చేసిన ఘనత రాజీవ్ గాంధీ గారిది అని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ గారి ఆశయాలు, సద్భావన, ఐక్యత, యువత సాధికారతను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత వెంకన్న , పిఎసిఎస్ వైస్ చైర్మన్అంబటి మహేందర్ రెడ్డి , కౌన్సిలర్లు వల్లందాసు ఉమా రవి,సునీత బధ్యానాయక్, రాంబాబు, రడం వెంకన్న, రడం శ్రీనివాస్, తరాల వీరేష్, దామరకొండ ప్రవీణ్, సామల నర్సయ్య, వసంత రావు,ఆరిద్రపు కుమార్, పార్వతి, ప్రభావతి,మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ నాయకులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తుర్క యాంజాల్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ జయంతి

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** తుర్కయంజాల్ డివిజన్ - 56 పరిధిలోని తుర్కయంజాల్ చౌరస్తాలో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివ కుమార్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కొత్తకుర్మ మంగమ్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ గారు అందించిన విశేష సేవలు చిరస్మరణీయం. యువత, సాంకేతిక రంగం, దేశ ప్రగతి పట్ల ఆయనకున్న దూరదృష్టి నేటి తరానికి ఆదర్శం. డిజిటల్ ఇండియా, పంచాయతీరాజ్ వ్యవస్థకు ఆయనే పునాది వేశారు" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ల అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, కోశిక ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ భీం రెడ్డి, దాసరి సుధాకర్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి, భద్రయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు కొత్తకుర్మ యశ్వంత్, గుడ్ల అర్జున్, చెక్క ధన్ రాజ్, చెక్క ప్రశాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



**విశ్వంభర, కమాన్‌పూర్:** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కేక్ కటింగ్ చేశారు అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ దేశ అభివృద్ధికి, ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు కాంగ్రెస్ శ్రేణులు అంకితమై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు రంగు సత్యనారాయణ గౌడ్, గుమ్మడి శ్రీనివాస్, బొంగోని సదయ్య,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెబల్ రాజ్ కుమార మాజీ ఎంపీటీసీ లు శేవ్వా శంకరయ్య,పిల్లి చంద్ర శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెన్ రెడ్డి కిషన్ రెడ్డి, మల్యాల మహేష్ గౌడ్, మహమ్మద్ యూసుఫ్ ఉప సర్పంచ్ రాజమహేందర్, నగునూరి నర్సయ్య గౌడ్, చిగురు రవీందర్, ఇనగంటి శ్రావణ్ కుమార్ చాట్ల గట్టయ్య,మేడగొని విజయ్, చాట్ల రాయమల్లు, కాడిపల్లి సుమన్, కోలేటి సురేష్, కొంతం శ్రీనివాస్, బోనాల పవన్, వెంగళి రాజయ్య,గర్రెపల్లి వెంకన్న, దాసరి రామస్వామి, మల్యాల చిన్న తిరుపతి, బత్తిని శ్రీనివాస్, బొంగుని వీరయ్య, బంగారి శ్రీనివాస్, ఆరెల్లి శ్రీనివాస్ లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలు, మండల కేంద్రాల సమగ్ర అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

## నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**విశ్వంభర, పెద్దశంకరంపేట:** గ్రామాలు, మండల కేంద్రాల సమగ్ర అభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పెద్దశంకరంపేట మండల కేంద్ర పరిధిలోని పలు వార్డులు, వీధుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మురుగు కాలువల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మండల కేంద్రంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**విశ్వంభర, పరిగి:** న్యూఢిల్లీలోని వీర్ భూమి వద్ద మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ సమాధికి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 21వ శతాబ్దపు దేశంగా తీర్చిదిద్దేందుకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు దేశ ప్రజలకు చిరస్మరణీయమని అన్నారు.సాంకేతిక రంగం, టెలికమ్యూనికేషన్స్, విద్య, యువత, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి రంగాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశాయని తెలిపారు.యువతే దేశ భవిష్యత్తు అనే దృక్పథంతో రాజీవ్ గాంధీ చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.



# కృష్ణా జలాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా

**మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



విశ్వంభర, సూర్యాపేట: చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద 1648 కోట్ల రూపాయలతో 53000 ఎకరాలకు నీరు అందించే మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను గురువారం రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మంత్రి అండర్ గ్రౌండ్ నందు పంపు హౌస్ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా నది మీద నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మొత్తం ఖర్చు 1,648 కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ 16 మెగా వాట్ల 4 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడం ద్వారా మట్టంపల్లి మండలంలో 9 గ్రామాలలో 20,466 ఎకరాలకు, మేళ్లచెరువు మండలంలో 5 గ్రామాలలో 15,829 ఎకరాలకు, చింతల పాలెం మండలంలో 9 గ్రామాలలో 16705 ఎకరాలకు మొత్తం 53000 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని దీని ద్వారా 5,080 ఎస్ టి , 3540 ఎస్ సి, 8470 బి సి, 2205 ఓ సి కుటుంబాలు మొత్తంగా 19,295 కుటుంబాలు లబ్ధి పొందుతాయని దీని కొరకు 191 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి వారికి నష్టపరిహారంగా 60 కోట్లు చెల్లించడం జరిగినదని నాగార్జున సాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకుని ఈ ప్రాంతం లోని గ్రామాలను సస్యశ్యామలం చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికీ ప్రాజెక్టు రూఫ్ టాప్ లెవెల్, పంప్ హౌస్ పనులు పూర్తి అవుతాయని వీలైనంత తొందరగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని మంత్రి గుత్తందారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, , అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి



విశ్వాంభర, పెద్ద శంకరంపేట : రైతుల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం శంకరంపేట మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. బురుగుపల్లి గ్రామంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ కోటమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతుల సంక్షేమం, గ్రామీణా భివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని బూరుగుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఆహార ధాన్యాల నిల్వ భవనం (గోదాం) నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, రైతులకు సౌకర్యం: రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఈ గోదాము ఎంతో ఉపయోగపడుతుందని, వర్షాలు లేదా ఇతర ప్రతికూల పరిస్థితుల్లో ధాన్యం పాడవకుండా రక్షణ లభిస్తుందని తెలిపారు. నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ గౌడ్, నారాయణ గౌడ్ మురళి పంతులు ఆర్య సంతోష్ కుమార్ బాసడ రాజు సుభాష్ గౌడ్ సర్పంచులు కుంట్ల రాములు విట్టల్ వెంకట్రావు శ్రీనివాస్ ప్రజాప్రతినిధులు, మండలానికి సంబంధించిన సర్పంచులు,మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు బూరుగుపల్లి గ్రామ రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో అంగన్‌వాడీ కేంద్రం



విశ్వంభర, హుస్నాబాద్: పట్టణంలోని ఒకటో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం కనీస వసతులు లేక సమస్యలతో సతమతమవుతోంది. చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందించాల్సిన కేంద్రంలో ఫ్లోరింగ్, మరుగుదొడ్డి వంటి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. 2024లో ఎమ్మెల్యే కోటా నుంచి రూ.6.50 లక్షలు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ అవి అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆరోపించారు. ఫ్లోరింగ్ లేక చిన్నారులు మట్టినేలపైనే కూర్చోవాల్సి వస్తోందన్నారు. భవనం కింద ఎలుకలు రంధ్రాలు చేయడంతో పాటు పాములు వస్తుండటంతో చిన్నారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకల వల్ల కేంద్రంలో నిల్వ ఉంచే గుడ్లు, పిండి పదార్థాలు, ఇతర పౌష్టికాహారం కూడా పాడవుతోందని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలకు మరుగుదొడ్డి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేసి ఫ్లోరింగ్, మరుగుదొడ్డి, ఇతర భద్రతా సదుపాయాలు కల్పించాలని వార్డు ప్రజలు డిమాండ్ చేశారు.

**త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం: సీడీపీఓ సుశీల**

అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు ఉన్న విషయం వాస్తవమేనని సీడీపీఓ సుశీల తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ఆలె నరేంద్ర ఆశయాల కొనసాగింపే నిజమైన నివాళి



విశ్వంభర, హైదరాబాదు : బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన టైగర్ ఆలే నరేంద్ర ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు అన్నారు. ఆలే నరేంద్ర 80వ జయంతి సందర్భంగా గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కటకం నర్సింగరావు మాట్లాడుతూ.. అరాచకాలకు వ్యతిరేకంగా ఆలే నరేంద్ర చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. బలహీన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజల సమస్యలపై నిబద్ధతతో పోరాడిన నరేంద్రను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఆలే నరేంద్ర ఒక వ్యక్తి కాదని, ఒక శక్తి అని అన్నారు. బలహీన వర్గాలకు అండగా నిలిచి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, అధికారం పోరాటం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. ఆలే నరేంద్ర విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని కోరారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ చిరంజీవులు మాట్లాడుతూ.. ప్రజలే ఆలే నరేంద్రకు 'టైగర్' అనే బిరుదు ఇచ్చారని, ఆయన జీవితం ప్రజల కోసమే అంకితం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో యెలికట్టే విజయకుమార్ గౌడ్, కోలా భాస్కర్‌రావు, గోదా మల్లికార్జున్, మంగ్లిపల్లి శంకర్, మార్కండేయ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, కత్తి వెంకటస్వామి, గందమల్ల ఆనంద్, గుజ్జ సత్యం, విజిఆర్ నారగోని, కప్పర ప్రసాద్, ఆలే జితేంద్ర, దాసు సురేష్, వట్టె జానయ్య, ఎయిర్టెల్ రాజు, సంజీవ, సత్యనారాయణ, పూస నరసింహ, ధర్మేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

# బాగ్‌లింగంపల్లిలో ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



విశ్వంభర, బాగ్‌లింగంపల్లి : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాదు బాగ్‌లింగంపల్లిలో రోషన్ల అగర్వాల్ ఫౌండేషన్ ట్రస్ట్ సౌజన్యంతో లాజిక్ మైనారిటీ సెల్ చైర్మన్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ దేశంలో సాంకేతిక, సమాచార రంగాల అభివృద్ధికి పునాది వేశారని అన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ దేశాన్ని ఆధునికత వైపు నడిపించిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రఘువీర్, లక్ష్మణ్‌వర్మ, రాజు, అంజి యాదవ్, నర్సింగ్‌రావు, బ్రహ్మచారి, నైషధం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా చేయలేదు.. కావాలనే మాపై బురదచల్లే యత్నం

**: తిరుమల మేడోస్ కాలనీవాసులు మేడిశెట్టి వెంకట్, శ్రీనివాస్ గుప్తా**



విశ్వంభర, బోడుప్పల్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని తిరుమల మేడోస్ కాలనీలో స్థల కబ్జా ఆరోపణలను మేడిశెట్టి వెంకట్, శ్రీనివాస్ గుప్తా ఖండించారు. ఈ విషయమై గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తాము ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని, జీపీఏ హోల్డర్ వద్ద చట్టబద్ధంగా స్థలం కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తమపై కబ్జా ఆరోపణలు చేస్తూ బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వివాదం పరిష్కారం కోసం ఈ నెల 6న కాలనీ పెద్దల సమక్షంలో 300 గజాల స్థలాన్ని కాలనీ అసోసియేషన్‌కు ఇచ్చేందుకు లిఖితపూర్వకంగా అంగీకారం తెలిపినట్లు చెప్పారు. తమకు సంబంధం లేని ఇతర స్థలాల వివాదాల్లో కూడా తమ పేర్లు ప్రస్తావిస్తూ కొందరు మానసికంగా వేధిస్తున్నారని, ఫోన్ల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ఏదైనా జరిగితే సంబంధిత వ్యక్తులదే బాధ్యత అని పేర్కొన్నారు. కాలనీలోని వివిధ లేఅవుట్లకు సంబంధించిన వాస్తవాలను సంబంధిత అధికారులు విచారణ చేసి స్పష్టం చేయాలని మేడిశెట్టి వెంకట్, శ్రీనివాస్ గుప్తా కోరారు.

## బర్త్‌డే బామ్మ కీరాంబి అవివేలు

**106వ జన్మదినం జరుపుకున్న శతాధిక వృద్ధురాలు**



విశ్వంభర, విద్యానగర్ : 106 ఏళ్ల వయసులోనూ చురుకైన జ్ఞాపకశక్తితో రామాయణం, సంస్కృత శ్లోకాలు, తెలుగు పాటలు పాడుతున్న కీరాంబి అవివేలు జన్మదిన వేడుకలను కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. విద్యానగర్‌లోని మజీద్‌లైన్‌లో గురువారం జరిగిన వేడుకల్లో ఆమెకు కుటుంబ సభ్యులు పాదపూజ చేసి, వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. దివంగత కీరాంబి కృష్ణమాచార్యుల సతీమణి అయిన అవివేలుకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వయసు మీదపడినా చేతికర్ర సహాయంతో నడుస్తూ తన పనులు తానే చేసుకుంటున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. చిన్ననాటి నుంచి నేర్చుకున్న రామాయణం, భాగవతం, సంస్కృత శ్లోకాలు, తెలుగు పాటలను ఇప్పటికీ గుర్తుంచుకుని పాడుతున్నారని చెప్పారు. జన్మదినం సందర్భంగా ఆమె పేరుతో కుటుంబసభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## మోసం చేసిన శ్యామ్‌ను కఠినంగా శిక్షించాలి

**:మృతురాలి కుటుంబ సభ్యుల డిమాండ్**



విశ్వంభర, మహబూబాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన డోలి సంధ్య మృతి ఘటనలో తన కుమార్తెను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టి. శ్యామ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆగస్టు 17న సంధ్య తన స్వగృహంలో ఉరివేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, తన మరణానికి టి. శ్యామ్ అనే వ్యక్తి కారణమంటూ ఆమె ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో పేర్కొన్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. తనను ప్రేమిస్తున్నానంటూ వెంటపడి చివరకు మోసం చేశాడని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సంధ్య లేఖలో రాసినట్లు వారు తెలిపారు. తనను మోసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఆమె లేఖలో కోరినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు ఆ లేఖను చూపిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను వేడుకున్నారు.

## విద్యార్థులకు ఉచిత బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ



విశ్వంభర, మహాదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బ్యాగులు, నోటు పుస్తకాలు, షూలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హసీనా భాను, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీజ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కటకం అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హసీనా భాను మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై బాగా చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కోట రాజబాబు మాట్లాడుతూ చదువుతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో మాట్లాడి కృషి చేస్తామని తెలిపారు. చల్ల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధన కోసం కష్టపడి చదవడంతో పాటు మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మించకుండా రోడ్డు.. వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

**వెంటనే రక్షణ గోడలు నిర్మించాలి: బీజేపీ నాయకుడు మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్**



విశ్వంభర, కమాన్‌పూర్: కమాన్‌పూర్ నుంచి సిద్దిపల్లె, గోదావరిఖని ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఇటీవల చేపట్టిన రోడ్డు నిర్మాణంలో కాలువ వద్ద బ్రిడ్జి లేదా కల్వర్టు నిర్మించకపోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని బీజేపీ నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు కింద నుంచి కాలువ నీరు ప్రవహిస్తున్నప్పటికీ, అక్కడ రక్షణ గోడలు, కల్వర్టు వంటి భద్రతా ఏర్పాట్లు చేయలేదన్నారు. దీంతో రహదారి అంచు ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే పరిస్థితిని పరిశీలించి కాలువ వద్ద బ్రిడ్జి లేదా కల్వర్టు నిర్మించడంతో పాటు రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేసి వాహనదారుల భద్రతకు చర్యలు తీసుకోవాలని మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



విశ్వంభర, చిక్కడపల్లి : దేశ అభివృద్ధికి దూరదృష్టితో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగారం సుధాకర్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాదు చిక్కడపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించడంలో రాజీవ్‌గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించండి

**:జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్**



విశ్వంభర, మహబూబాబాద్: సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి ప్రాసిక్యూషన్ తరఫున పూర్తి సహకారం అందించి అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ ప్రాసిక్యూటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని కేసులు నేరుగా రాజీ పడదగినవి కాకపోయినా ఇరుపక్షాలు రాజీకి సిద్ధంగా ఉండి, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు రాజీ అవసరమని భావించిన సందర్భాల్లో చట్టపరమైన నిబంధనలకు లోబడి పరిష్కార మార్గాలను పరిశీలించాలని సూచించారు. లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం ఇరుపక్షాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొల్పి వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా అభియోగ న్యాయవాదులు కొంపెల్లి వెంకటయ్య, జయ, లత తదితరులు హాజరయ్యారు.

## పోచారం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ఇప్పటివరకు అభివృద్ధి పనులపైనే దృష్టి సారించానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అయితే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వ్యక్తిగత విమర్శలు చేస్తే ఇకపై సహించబోమని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి సుమారు రూ.1.05 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా గ్రామపం చాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. పంచాయతీ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మరో రూ.20 లక్షలతో భూగర్భ రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "ఇప్పటివరకు అభివృద్ధిపైనే దృష్టి పెట్టా.. ఇకపై అసత్య ప్రచారాలు చేస్తే భరతం పడతాం. తీరు మార్చుకోకపోతే మా కార్యకర్తలు కూడా తగిన విధంగా స్పందిస్తారు" అని మల్రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొచ్చి రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులను మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# సూర్యాపేట మార్కెట్ కమిటీ పనితీరు అద్భుతంగా ఉంది :ఉత్తమ్ కుమార్ రెడ్డి



విశ్వంభర, సూర్యాపేట: గురువారం సూర్యాపేట మార్కెట్ యార్డులో 3 కోట్ల 80 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న పలు రకాల మౌలిక వసతులు, మార్కెట్ షెడ్, సోలార్ ప్లాంట్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ నందు రైతులకు ఉచితంగా అల్పాహారం అందించడం, రూ.5 లకు మధ్యాహ్న భోజన వసతి కల్పించడం హర్షనీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రికి చెప్తానని అన్నారు. మార్కెట్ లో పనిచేసే కార్మికులకు, సిబ్బందికి ఏకరూప దుస్తులు అందజేయడం, కూల్ వాటర్ సౌకర్యాం కల్పించడం పట్ల అభినందనలు తెలిపారు. సూర్యాపేట మార్కెట్ కమిటీ పనితీరు బాగుందని తాను మళ్ళీ ఒకసారి వచ్చి రెండు గంటల సమయం మార్కెట్లో గడుపుతానని, మార్కెట్ ను పరిశీలిస్తానని ఆయన అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో అభివృద్ధి కోసం 95 లక్షల రూపాయలు అందజేస్తామని, అలాగే మామిడి మార్కెట్ కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించవలసిందిగా జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, ఎస్పి నరసింహ, సూర్యాపేట ఆర్డిఓ వేణుమాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సెక్రటరి ఫక్రుద్దీన్, డైరెక్టర్ లు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయ ఏఓ ఇంట్లో ఏసీబీ సోదాలు





విశ్వంభర, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్ నేతృత్వంలోని బృందాలు ఏకకాలంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. శ్రీనివాస్‌రెడ్డి గతంలో మహేశ్వరం మండలంలో తహసీల్దార్‌గా పనిచేయగా, ప్రస్తుతం ఇబ్రహీం పట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన నివాసంతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన ప్రాంతాలు, సంబంధిత కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. సోదాల్లో స్థిరాస్తి పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు లావాదేవీల వివరాలు, నగదు, బంగారు ఆభరణాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. ప్రాథమికంగా పది ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు, హస్తినాపురంలో మూడంతస్తుల భవనం, సుమారు ఒకటిన్నర కిలోల బంగారు ఆభరణాలు గుర్తించినట్లు సమాచారం. అక్రమాస్తుల విలువ రూ.100 కోట్లకు పైగా ఉండవచ్చని ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తు న్నాయి. సోదాలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల విలువను లెక్కించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపారు.

# రాజీవ్ గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయం

## డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



విశ్వంభర, సంగారెడ్డి: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను ఆమె స్మరించుకున్నారు.దేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్య తనిస్తూ, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల విస్తరణకు రాజీవ్ గాంధీ తీసుకున్న చర్యలు భవిష్యత్ భారత నిర్మాణానికి బాటలు వేశాయని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని ఆమె గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్ లు గడ్డం రాజు, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# వేములకొండ, అర్రూర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటన



విశ్వంభర, వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వేములకొండ, అర్రూర్ గ్రామాల్లో స్థానిక సంస్థల సహాయ కలెక్టర్ ఏ. భాస్కర్ రావు, ఐఏఎస్ విస్తృతంగా పర్యటించారు. వైద్య సేవలు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ, అంగన్‌వాడీ సేవలు, చేయూత పింఛన్ల అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హాజరు రిజిస్టర్లు, మందుల నిల్వలు, వైద్య సిబ్బంది అందుబాటును పరిశీలించారు. వర్షాకాలానికి అవసరమైన మందులను సమృద్ధిగా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో వర్షపు నీటి సంరక్షణ కోసం ఫారం పాండ్లు, సోక్‌పిట్లు, మ్యాజిక్ సోక్‌పిట్ల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. అర్రూర్‌లో పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పెంపకం, వర్షపు నీటి నిల్వ చర్యలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న ఆహారం, స్టాక్ నాణ్యతను తనిఖీ చేసి చిన్నారులతో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, అత్యవసర సౌకర్యాలపై ఆరా తీశారు. చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళల వివరాలను పరిశీలించి, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత, ఏపీఓ పరశురాములు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో ఎర్రగడ్డపల్లి రోడ్డు పనులు వేగవంతం

## పరిగి మున్సిపల్ చైర్పర్సన్ రజిత వెంకటేష్



విశ్వంభర, పరిగి: మున్సిపాలిటీ పరిధిలోని ఐదు, ఆరో వార్డులో గల ఎర్రగడ్డ పల్లి రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎర్రగడ్డ పల్లి రోడ్డు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో ముమ్మరంగా పనులు కొనసాగుతున్న అన్నారు. రోడ్డు పూర్తయితే ఎర్రగడ్డ పల్లి, సుల్తాన్ నగర్, నారాయణపూర్ మార్గంలో రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజల దశాబ్దాల కల నెరవేరటం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రోడ్డు పనులు నాణ్యతతో త్వరితగతిన వాహనదా రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ యూసుఫ్, కో ఆప్షన్ సభ్యులు అక్బర్ హుస్సేన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటరామిరెడ్డి, జగన్, నవాజ్, మల్లేష్, సర్ఫరాజ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో మునిగి 16 ఏళ్ల విద్యార్థి మృతి



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండలంలోని కేసీ తండా కొత్వాల్ చెరువులో విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన 16 ఏళ్ల విద్యార్థి సుప్రతిక్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మంచిర్యాలకు చెందిన సుప్రతిక్ మహేశ్వరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఎస్‌సీటీ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఐదుగురు స్నేహితులతో కలిసి కేసీ తండాలోని కొత్వాల్ చెరువుకు ఈతకు వెళ్లాడు. స్నేహితుల్లో ఇద్దరికి మాత్రమే ఈత వచ్చు. వారు నీటిలో ఈత కొడుతుండగా, మిగతా ముగ్గురు గట్టుపై ఉండి చూస్తున్నారు. ఈ క్రమంలో స్నేహితులు ఈత కొడుతుండటంతో తాను కూడా ఈత కొట్టాలనే ఉద్దేశంతో సుప్రతిక్ నీటిలోకి దిగాడు. అయితే ప్రమాదవశాత్తు లోతైన నీటిలోకి వెళ్లిమునిగి పోయాడు. స్నేహితులు గమనించి బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఓపెన్ టెన్త్ ఇంటర్ అడ్మిషన్లకు ఆహ్వానం

## : కోఆర్డినేటర్ యాకయ్య



విశ్వంభర, ఇనుగుర్తి: చదువు మధ్యలో మానివేసిన విద్యార్థిని విద్యార్థులు ఓపెన్ విద్యా విధానంతో 10వ,తరగతి,ఇంటర్మీడియట్ లలో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ స్థానిక హెచ్‌ఎం అమ్మ యాకయ్య, అసిస్టెంట్ కోఆర్డినేటర్ తాళ్ల ప్రణయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్ లలో అడ్మిషన్ పొందడానికి ఈనెల 31 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ఇనుగుర్తి హై స్కూల్ కు మంజూరైనట్లు పేర్కొన్నారు. టెన్త్ కోసం దరఖాస్తు చేసేవారు 14 సం.లు, ఇంటర్మీడియట్ కోసం15 సం.లు వయసు ఆగస్టు 31 వరకు నిండిన వారందరూ అర్హులని తెలిపారు.టెన్త్ లో ప్రవేశం పొందేవారు ఏ విధమైన విద్యార్హత లేకున్నా జైన్ కావచ్చుని, ఇంటర్మీడియట్ లో అడ్మిషన్ ఉండేవారు 10వ,తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన తర్వాత సాధారణ ఎస్ఎస్సి ఇంటర్ కు సమానమైన ప్రభుత్వ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు 93470 45680 మొబైల్ ను సంప్రదించాలని కోరారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



విశ్వంభర, గిరి నగర్: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్.అనంతరం రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోల్డెన్ జూబ్లీ సంబరాలు

విశ్వంభర, ఉప్పుగూడ : శ్రీ విఘ్నేశ్వర సాయిధామం, మల్లికార్జున్ నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ లలితాబాగ్ ఉప్పుగూడ కమిటీ సభ్యులు 50 సంవత్సరాలు గోల్డెన్ జూబ్లీ సంబరాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వైవిధ్య భరితమైన థీమ్లతో చూపర్లను ఆ కట్టుకొంటూ ఈ సంవత్సరం వినాయక చవితికి సరికొత్త థీమ్ విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం వికసితభారత్ 2047 విజన్ తో రోబోటిక్ ఆర్మర్ వేసుకొని ఉంటాడని విశ్వకర్మ రవీంద్ర చారి నాగోల్ వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్మిస్తున్నారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రాండ్ అంబాసిడర్ సుభాన్షు శుక్ల గారికి ఆహ్వానించడం జరుగుతుందని పత్రికా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి,మునిగంటి శశి కుమార్ చారి, గుండు శ్రీకాంత్, వెంకటేష్ బొడ్డు, దయానంద్, సాయి చరణ్ రెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

# 'అమ్మకు అక్షరమాల'లో ఉత్సాహంగా పాల్గొన్న అభ్యాసకులు



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: చదువుకు వయస్సు అడ్డంకి కాదని, అక్షరాస్యతతో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెరుగుతాయని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి తెలిపారు. ఆమె ఆదేశాల మేరకు గురువారం చంపాపేట ప్రాథమిక పాఠశాలలో పాఠశాల సమయం అనంతరం 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభ్యాసకులు అక్షర వికాసం పాఠ్యపుస్తకం ద్వారా చదవడం, రాయడం నేర్చుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్షరజ్ఞానం లేని వారికి చదవడం, రాయడం నేర్పించి వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా విద్యను అభ్యసించి అక్షరజ్ఞానం సాధించేందుకు అభ్యాసకులు చూపుతున్న ఆసక్తి, పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# గాంధీనగర్ కాలనీ 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



విశ్వంభర, మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని గాంధీనగర్ కాలనీ, 10వ వార్డు (చర్చి కాలనీ పక్కన)లో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసులు తమ ఇబ్బందులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఛైర్‌పర్సన్ విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో విద్యుత్ సిబ్బంది 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీలో చాలాకాలంగా ఎదురవుతున్న లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్యకు గాంధీనగర్ కాలనీ వాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



విశ్వంభర, ముషీరాబాద్ : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించు కుని కాంగ్రెస్ సీనియర్ నాయకులు లోకేష్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాదు ముషీరాబాద్ నియోజకవర్గం సుందరయ్య పార్క్ వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం ముఖ్య అతిథి కాంగ్రెస్ సీనియర్ నాయకులు అరవింద్ కుమార్ యాదవ్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ యువత, విద్య, సాంకేతిక రంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల ప్రోత్సాహానికి, సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగభూషణం, అంజి యాదవ్, నైషధం సత్యనారాయణ మూర్తి,, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవోలతో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు



విశ్వంభర, సికింద్రాబాద్ : పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను ఐటీఐ-ఏటీసీలతో అనుసంధానం చేసే జీవో నం. 97ను వెంటనే రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సుమారు 3 వేల మంది విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడు తూ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలు పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. పాలిటెక్నిక్ విద్య ప్రత్యేకమైన సాంకేతిక విద్యా వ్యవస్థ అని, దాని ప్రమాణాలను పెంచాల్సిన ప్రభుత్వం డిప్లమా కోర్సులను ఇతర శిక్షణా కోర్సులతో అనుసంధానం చేయడం సరికాదన్నారు. జీవో నం. 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రజనీకాంత్, ప్రవీణ్, ఆంజనేయులు, భరత్, కార్తీక్, మనోజ్, చరణ్ సాయి, తేజ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏకశిల నగర్ కాలనీ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి వినతి




విశ్వంభర, ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలోని ఏకశిల నగర్ కాలనీకి సంబంధించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తు లను పరిశీలించి న్యాయబద్ధంగా పరిష్కరించాలని కాలనీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణికి వినతిపత్రం అందజే శారు. కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ, సర్వే నంబర్లు 739 నుంచి 749 వరకు సుమారు 149 ఎకరాల విస్తీర్ణంలో 1985లో 2,109 ప్లాట్లతో ఏకశిల నగర్ కాలనీ ఏర్పడిందని తెలిపారు. అప్పటి నుంచి వందలాది మంది ప్లాట్లను కొనుగోలు చేసి దీర్ఘకాలంగా స్వాధీనంలో ఉన్నారని పేర్కొన్నారు. 2008--09, 2015--16 సంవత్సరాల్లో అమలైన ఎల్ఆర్ఎస్ పథకాల ద్వారా కాలనీలోని వందలాది ప్లాట్లు ఇప్పటికే క్రమబద్ధీకరణ పొందాయని తెలిపారు. 2020లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ పథకంలో కూడా పలువురు ప్లాట్ యజమానులు దరఖాస్తు చేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు రుసుములు చెల్లించారని చెప్పారు. కాలనీ భూములకు సంబంధించి గతంలో తలెత్తిన వివాదాలు, సంబంధిత పత్రాలపై జరిగిన చర్యలు, 2025 మార్చి 12న హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. అనంతరం కాలనీ ప్రతినిధులు మీడియాతో తమ సమస్యలను వివరించారు.

# ఎమ్మార్పీఎస్ కోమటిపల్లి గ్రామ కమిటీ ఎన్నిక



విశ్వంభర, ఇనుగుర్తి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ ఆదేశాల మేరకు ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి ఎంఆర్పిఎస్ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేసి ప్రకటించినట్లు మండల ఇన్చార్జి చెడుపాక యాకన్న తెలిపారు. గ్రామ నూతన అధ్యక్షులుగా పోలెపాక ప్రభాకర్,అధికార ప్రతినిధి బొల్లంపల్లి మహేందర్,ప్రధాన కార్యదర్శి జల్లె ప్రవీణ్,మారెపాక రాజు,ఉపాధ్యక్షులు కొర్లపాటి తరుణ్,నర్ర సామేలు,జల్లె కొమరయ్య లను ఎన్నుకున్నట్లు వివరించారు.కోశాధికారి చెరుకు మల్లేష్, గౌరవ సలహాదారులు మారపాక లక్ష్మీనారాయణ, ఈసంపల్లి మల్లయ్య,జల్లె శ్రీను,పోలెపాక వెంకన్న,జల్లె రఘుపతి లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాకన్నతోపాటు సీనియర్ నాయకులు నూతన కమిటీ కి శుభాకాంక్షలు తెలిపారు.అందరి సహకారంతో మాదిగ హక్కులు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని తమపై నమ్మకం ఉంచి కమిటీకి బాధ్యతలు అప్పగించిన అందరికీ నూతన అధ్యక్షులు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మారెపాక సందీప్ దాసరి పవన్ ఈసంపల్లి జస్వంత్ పోలెపాక బాలయ్య జల్లె మల్లేష్ చెరుకు ఐలయ్య జల్లె ప్రశాంత్ తో పాటు పలువురు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

# ఐటీ రంగం అభివృద్ధికి రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు వి హెచ్, జగ్గారెడ్డి**



విశ్వంభర, హైదరాబాద్ :దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ.. భారతదేశంలో ఐటీ రంగం అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. యువతకు గతంలో 21 సంవత్సరాలుగా ఉన్న ఓటు హక్కు వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత కూడా రాజీవ్ గాంధీకే దక్కుతుందని పేర్కొన్నారు. అనంతరం వి. హనుమంతరావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ సద్భావన రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ర్యాలీగా తరలివచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. జాతీయ జెండాలు, పార్టీ జెండాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. రాజీవ్ గాంధీ దేశభక్తి, త్యాగాలు, దేశాభివృద్ధికి చేసిన కృషిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రాములు నాయక్, జి. నిరంజన్, ఫెరోజ్ ఖాన్, మెట్టు సాయికుమార్, రాజయ్య, దీపక్, జాన్ కాలేద్, సైఫుల్లా, బొల్లు కిషన్, ఆర్. లక్ష్మణ్ యాదవ్, అప్సర్, యూసుఫ్ జాయి, శంభుల శ్రీకాంత్ గౌడ్ తదితరులతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేని కలిసిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



విశ్వంభర, పరిగి: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి న్యూఢిల్లీలోని ఆయన కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు,సంస్థాగత వ్యవహారాలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఖర్గే తో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చర్చించారు.రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని,రాబోయే రెండు నెలల్లో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా,ఒక్క అర్హుడి ఓటు కూడా పోకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో జరగనున్న క్యాబినెట్ విస్తరణలో తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ని కోరినట్లు తెలిపారు.

## సంస్థాన్ బీజేపీలో అంతర్గత విభేదాలు

**ప్రజాసేవను ఓర్వలేకే పార్టీ పదవుల నుంచి తొలగింపు: బండమీద కిరణ్**



విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల బీజేపీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. తమపై క్రమశిక్షణ చర్యల పేరుతో పార్టీ పదవులు తొలగించడాన్ని బండమీద కిరణ్, ఎలిజాల శ్రీను, గుండె మల్లేష్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వివరణ కోరకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. గ్రామాల్లో వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో ప్రజలకు సేవ చేయడమే తాము చేసిన తప్పా అని ప్రశ్నించారు. దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న తమపై అణచివేత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. బీసీ నాయకుల పార్టీ పదవులను తొలగించడం, సీనియర్ నాయకులను పార్టీ కార్యక్రమాలకు దూరం చేయడం నియంతృత్వానికి నిదర్శన మన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు సుర్వి రాజు, దోనూరు వీరారెడ్డిల తీరుపై జిల్లా నాయకత్వం దృష్టి సారించి, పార్టీ పదవుల నుంచి వారిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సంస్థాన్ నారాయణపురంలో పార్టీని బలోపేతం చేసేందుకు సీనియర్ నాయకులు, యువతకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

## మంత్రి సీతక్కతో కేరళ మంత్రి సిద్ధికి భేటీ



విశ్వంభర, హైదరాబాదు : కేరళ వ్యవసాయ శాఖ మంత్రి టి. సిద్ధికి ప్రజాభవన్‌లో తెలంగాణ మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి సీతక్క నివాసానికి వచ్చిన సిద్ధికిని ఆమె శాలువాతో సత్కరించారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళులు




విశ్వంభర, హైదరాబాదు : భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. దేశంలో కంప్యూటర్ విప్లవానికి రాజీవ్ గాంధీ పునాది వేశారని అన్నారు. యువత ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన రాజీవ్ గాంధీ సద్భావనా రన్‌లో విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. జాతీయ, కాంగ్రెస్ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గా రెడ్డి, షబ్బీర్ అలీ, అనిల్ కుమార్ యాదవ్, రాములు నాయక్, జి. నిరంజన్, ఫెరోజ్ ఖాన్, మెట్టు సాయి కుమార్, రాజయ్య, దీపక్ జాన్, కాలేద్ సైఫుల్లా, బొల్లు కిషన్, ఆర్. లక్ష్మణ్ యాదవ్, అప్సర్ యూసుఫ్ జహీ, శంబూల శ్రీకాంత్ గౌడ్ , గడ్డం శ్రీధర్ గౌడ్, అరవింద్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత.. శాంతి.. సామరస్యమే లక్ష్యంగా సద్భావన వాక్

**: ఉప్పల శ్రీనివాస్ గుప్తా**




విశ్వంభర, హైదరాబాద్ : జాతీయ సమైక్యత, సోదరభావం, శాంతి, సామరస్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న నేషనల్ ఇంటిగ్రేషన్ వీక్లో భాగంగా సద్భావన దివస్ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాల నగర్ చింతల్ లో నిర్వహించిన ప్రత్యేక వాక్ కార్యక్రమానికి టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సాంకేతిక, సమాచార విప్లవానికి నాంది పలికిన దూరదృష్టి గల నాయకుడు, మాజీ ప్రధాని, 'భారతరత్న',స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి ('సద్భావనా దివస్') సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పించారు ఆయన జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది అని ఆయన అన్నారు.దేశ ప్రజల మధ్య ఐక్యత, సామరస్యం, పరస్పర గౌరవం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ శాంతి, సోదరభావంతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ,మహేష్ గౌడ్ , గంధం రాములు , ఐవిఎఫ్ యువజన సంఘం అధ్యక్షుడు కట్ట రవి కుమార్ గుప్త ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చు: డిసి శ్రీకాంత్




విశ్వంభ ర, సరూర్ నగర్ : పరిసరాల పరిశుభ్రత తోనే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సరూర్నగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవ అవగాహన కార్యక్రమం ను డిసి శ్రీకాంత్ పర్యవేక్షణలో సరూర్నగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయినీ శంకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు రోడ్లపై, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త రిక్షా లోనే వేయాలని సూచించారు. కాలనీ ప్రజలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన దోమల రహిత వాతావరణాన్ని అందించడమే ఈ అవగాహన కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ కార్యదర్శి అరవింద్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో మధుయాష్కి



విశ్వంభర, ఎల్బీనగర్: మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగిన జయంతి వేడుకల్లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే , కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ , లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ ,ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ( ఆర్గనైజేషన్ ) కేసీ వేణుగోపాల్ , ఎంపీ రాజీవ్ శుక్ల , చింతా మోహన్ తదితర నేతలతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి వారు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ గారు దేశానికి అందించిన సేవలను నేతలు గుర్తు చేసుకున్నారు. ప్రధానిగా దేశ అభ్యున్నతికి అనేక సంస్కరణలతో పాటు దేశంలో సమాచార, సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయులు రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా మధుయాష్కి పేర్కొన్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకం కోసం లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జీపీవో

విశ్వంభర, హైదరాబాద్ : ఏసీబీ అధికారులకు మరో ప్రభుత్వ ఉద్యోగి పట్టుబడ్డాడు. కరీంనగర్ జిల్లా శంకరంపేట మండలం పరిధిలోని మోలంగూర్ గ్రామ పాలన అధికారి కాంపేటి శ్రీనివాస్ బాధితుడి నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా కరీంనగర్ ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. స్వయంగా ఫిర్యాదుదారుడు తయారు చేసిన భూమి సర్వే నివేదికకు రిజిస్ట్రేషన్ , పట్టాదారు పాస్ బుక్ జారీ చేయాలని జీపీవోను సంప్రదించాడు. అందుకు ప్రతిఫలంగా 20వేల రూపాయలు డిమాండ్ చేయడంతో ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు లంచం ఇవ్వగా మాటువేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జీపీవోపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచామని అధికారులు వివరించారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



విశ్వంభర, హైదరాబాద్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సచివాల యం ఎదురుగా గల ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత్ రావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, లక్ష్మణ్ యాదవ్, రాపోలు జయప్రకాశ్ తదితరులు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను, ముఖ్యంగా ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు.

## పార్టీ కార్యకర్తలకు కమిటీ సభ్యులుగా బాధ్యతలు



విశ్వంభర, గుండ్లపోచంపల్లి: గుండ్లపోచంపల్లి డివిజన్‌లో గ్రామ, బూత్ స్థాయి కమిటీల నియామకంపై కాంగ్రెస్ పార్టీ ముఖ్య సమావేశం నిర్వహించారు. సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అర్హులైన పార్టీ కార్యకర్తలకు కమిటీ సభ్యులుగా బాధ్యతలు అప్పగించనున్నట్లు నాయకులు తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గుండ్లపోచంపల్లి గ్రామ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ నేతలు



విశ్వంభర, ఉప్పల్: ఉప్పల్ లోని మహంకాళి అమ్మవారిని మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ప్రెసిడెంట్ తోటకూర వజ్రేష్ యాదవ్ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి సాదరంగా ఆహ్వానించి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందివ్వడం జరిగింది.

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట సీపీఎం ధర్నా




విశ్వంభర, పెద్దపల్లి : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిరుద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లవుతున్నా హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఆలస్యం అవుతున్న కారణంగా వయోపరిమితి పెంచాలని, పేద, మధ్య తరగతి వర్గాల నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామక పరీక్షల లీకేజీలను అరికట్టాలని, పరీక్షల నిర్వహణ పూర్తి పారదర్శకంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్లలో వినతిపత్రాలు అందజేశారు.

## పాలిటెక్నిక్ విద్యాసంస్థల బంద్ విజయవంతం




విశ్వంభర,కేసముద్రం : ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్ కేసముద్రం మండల కేంద్రంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలకు వచ్చిన విద్యార్థులతో కలిసి కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ జీవో నెంబర్ 97 పేరుతో ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ విద్యను మొత్తం ఐటిఐ లో వెళ్లిన చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 97 ను వెనక్కి తీసుకోవాలని లేని లా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి నాయకులు మహేష్, విక్రం, నందీశ్వర్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 22న ఉద్యోగ మేళా



విశ్వంభర, మహబూబాబాద్: ఆదర్శ ఆటో మోటివ్స్ సంస్థ మహబూబాబాద్ పరిధిలో పనిచేయుటకు అర్హత కలిగిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించుటకు, 22 న జిల్లా ఎంప్లాయ్మెంట్ కార్యాలయం, మహబూబాబాద్ లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి. రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ ఆటో మోటివ్స్ కంపెనీలో గల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డ్రైవర్, ఆఫీస్ బాయ్స్, సర్వీస్ అడ్వైసర్, వర్క్ మేనేజర్, వాష్ బాయ్స్, కస్టమర్ కేర్, పోస్టుల కోసం అభ్యర్థులు 18-30 సంవత్సరాలు (పురుషులు ) మధ్య వయసు కలిగి ఇంటర్మీడియట్ / ఏదైనా డిగ్రీ, ఐ.టి.ఐ /డిప్లొమా ఇన్ మెకానిక్ అర్హతలతో, ఆసక్తి కల్గిన అభ్యర్థులు తేది: 22.08.2026 న ఐ.డి.ఓ.సి లోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జరుగు జాబ్ మేళాకు విద్యార్హత సర్టిఫికేట్లతో, వివరాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## రూపారెడ్డిని హత్య చేసిన విద్యార్థులను కఠినంగా శిక్షించాలి

**ఈనెల 21న ప్రైవేట్ స్కూల్స్ బంద్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్**





విశ్వంభర, బషీర్ బాగ్: నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డిని హత్య చేసిన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఘటనకు నిరసనగా రేపు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో రూపారెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోవడం ఆందోళనకరమన్నారు. పాఠశాలకు మొబైల్ ఫోన్ తీసుకురావద్దని చెప్పినందుకు ప్రిన్సిపాల్‌ను హత్య చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులైన విద్యార్థులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల రక్షణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని యాదగిరి కోరారు.

## రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు



విశ్వంభర, జీహెచ్ఎంసీ: భారత మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని చారిత్రాత్మక చార్మినార్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి. ఆనంద్, బీసీ, ఎస్సీ, ఎస్టీ చైతన్య వేదిక తెలంగాణ అధ్యక్షుడు కె. హరినాథ్, ఉపాధ్యక్షుడు ఎస్. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణం కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. కంప్యూటర్, దూరసంప్రదింపుల రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషి దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేసిందని పేర్కొన్నారు. యువతకు అవకాశాలు కల్పించడం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఆయన చూపిన దార్శనికత చిరస్మరణీయమన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కల్పించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, చైతన్య వేదిక ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పరిగి మున్సిపాలిటీలో ఘనంగా వనమహోత్సవం



విశ్వంభర, పరిగి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు, జింకానా గ్రౌండ్ వెంచర్ సమీపంలో 'వనమహోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ హరిత కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కుదుముల రజిత వెంకటేష్, వైస్ చైర్ పర్సన్ హన్మంతు, మున్సిపల్ కమిషనర్ మల్లేష్, మార్కెట్ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యూబ్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజపూల రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలకమన్నారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే లా వార్డు ప్రజలు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఆరిఫ్, యూసఫ్, కో ఆప్షన్ సభ్యులు అనేశీ ఆంజనేయులు, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ చిరస్మరణీయుడు: దేప భాస్కర్ రెడ్డి



విశ్వంభర, సరూర్ నగర్ : భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మహేశ్వరం నియోజక వర్గంలోని ఎన్టీఆర్ నగర్ డివిజన్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పిడి లింగ స్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి, కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువతకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు, సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, భారతదేశాన్ని ఆధునికత వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక ఉపేందర్ రెడ్డి , నాయకులు తలాటి రమేష్, దుబ్బాక శేఖర్, జ్ఞానేశ్వర్ యాదవ్, ఎస్.కె. ఎస్కే మహమ్మద్ , మామిడి రామకృష్ణ గౌడ్, షేక్ నబీ, షఫీ పాషా, పటేల్ రఫీక్, సమ్మద్, ప్రేమ్ నాయక్, పెద్దవూర సైదులు, కృష్ణారావు, ఎల్లారెడ్డి, జహంగీర్, నర్సింహా యాదవ్, యాదయ్య, సంతోష్, అక్రమ్, మహిళా నాయకురాళ్లు రేణుక, అరుణ, మంజుల తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టిన తేదీపై వివాదం.. చిక్కుల్లో బీసీసీఐ చీఫ్



**శ్రీనగర్:** బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ చిక్కుల్లో పడ్డాడు. జూనియర్ స్థాయి క్రికెట్ సెలక్షన్‌లో ఎంపికయ్యేందుకు పుట్టినతేదీని మార్చినట్లు మిథున్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబరు 3లోపు నివేదిక సమర్పించాలని జమ్మూలోని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. మాజీ డీఎస్పీ, జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ మాజీ జాయింట్ గౌరవ కార్యదర్శి సుదర్శన్ మెహతా దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు కోర్టు ఈ ఆదేశాలు జారీచేసింది. సబ్-జూనియర్, జూనియర్ విభాగాల్లోని జాతీయ టోర్నమెంట్‌ల ఎంపికకు అర్హత సాధించేందుకు మన్హాస్ రెండు వేర్వేరు పుట్టిన తేదీలను సమర్పించారని ఫిర్యాదుదారు ఆరోపించారు. మాజీ ఫస్ట్-క్లాస్ క్రికెటర్ అయిన మిథున్ మన్హాస్ది జమ్మూకశ్మీర్. సొంతజట్టుకు ఆడి కెరీర్‌ను ప్రారంభించిన ఇతను తర్వాత ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత జమ్మూకశ్మీర్ క్రికెట్ సంఘంలో పాలకుడిగా పనిచేశాడు. అతను భారత జట్టు తరపున ఎప్పుడూ ఆడలేదు. గతేడాది సెప్టెంబరులో బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు.

## ఏడు రోజుల నష్టాలకు బ్రేక్.. భారీ లాభాల్లో ముగిసిన సూచీలు



**విశ్వంభర, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. దీంతో వరుసగా ఏడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. గురువారం సెషన్‌లో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా బాండ్ల రాబడులు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. రియాల్టీ, ప్రైవేట్ బ్యాంక్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,909.68) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,611.11 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 628.04 పాయింట్ల లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.55 పాయింట్లు పెరిగి 24,231.85 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. సెన్సెక్స్ 30లో టైటాన్, హెచ్‌సీఎల్, ఇండిగో, టాటా స్టీల్ కంపెనీ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 93.94డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ మార్కెట్ సూచీలు కూడా లాభాల్లోనే ట్రేడయ్యాయి.

## గూగుల్ ఆఫర్: కాలేజీ విద్యార్థులకు ఏడాది పాటు 'ఏఐ ప్లస్' ఫ్రీ

**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ భారతీయ కాలేజీ విద్యార్థులకు శుభవార్త చెప్పింది. 'గూగుల్ ఏఐ ప్లస్' సబ్‌స్క్రిప్షన్‌ను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. గూగుల్ ఏఐ అసిస్టెంట్, సెర్చ్ ద్వారా ఎడ్యుకేషనల్ టూల్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొంది.అమెరికాలోని కాలేజీ విద్యార్థుల కోసం గూగుల్ ఏఐ ప్రో ప్లాన్‌ను ఉచితంగా అందిస్తుండగా.. ఇప్పుడు భారతీయ కాలేజీ విద్యార్థుల కోసం 'గూగుల్ ఏఐ ప్లస్'ను ఏడాది పాటు ఉచితంగా తీసుకురానుంది. జీ-మెయిల్, డాక్స్‌లో జెమినై సేవలు లభించనున్నాయి. రీసెర్చ్, అనాలసిస్ కోసం నోట్‌బుక్ ఎల్ఎమ్ కూడా వాడుకోవచ్చు. దీంతో పాటు ఫొటోలు, డ్రైవ్, జీమెయిల్ కోసం 400 జీబీ స్టోరేజీని ఉచితంగా పొందొచ్చు. సాధారణంగా గూగుల్ ఏఐ ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధరను నెలకు రూ.399గా (ఏడాదికి రూ.4,788) కంపెనీ నిర్ణయించింది. గూగుల్ ఏఐ ప్లస్‌లో భాగంగా స్టడీ నోట్‌బుక్స్, ఫ్లాష్‌కార్డులను క్రియేట్ చేయడం, ప్రాక్టీస్ క్విజ్‌లు వంటి ఇతర సదుపాయాలను గూగుల్ కల్పిస్తుంది. జెమినై లైవ్ కూడా అందుబాటులో ఉంటుంది. విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్రో, యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై 70 శాతం డిస్కౌంట్‌ను కూడా ఆఫర్ చేస్తోంది. గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్‌తో యూట్యూబ్ ప్రీమియం లైట్ కూడా పొందొచ్చు. అర్హత కలిగిన విద్యార్థులు పర్సనల్ గూగుల్ అకౌంట్‌తో గూగుల్ వన్‌లో సైన్ అప్ కావొచ్చు. విద్యార్థుల అర్హతను గూగుల్ షీర్ఐడీ ప్లాట్‌ఫామ్ ద్వారా వెరిఫై చేయనుంది.




# ముగిసిన సింధు పోరాటం..






## గాయపడినా అద్భుత విజయం సాధించిన చైనా షట్లర్

**విశ్వంభర, ఢిల్లీ:** సొంతగడ్డపై జరుగుతున్న ప్రతిష్ఠాత్మక టోర్నీ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను స్టార్ షట్లర్ పి.వి.సింధు పతకం లేకుండానే ముగించింది. మహిళల సింగిల్స్‌లో ఆమె పోరాటం ముగిసింది. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సింధు 11-21, 21-15, 17-21తో ప్రపంచ నంబర్ 3 వాంగ్ జి యిని (చైనా) చేతిలో ఓటమిపాలైంది. చివర్లో చైనా షట్లర్ గాయంతో ఇబ్బందిపడినా గొప్పగా పోరాడిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. తొలి గేమ్‌లో ఆరంభంలో చైనా షట్లర్‌కు సింధు గట్టి పోటీ ఇచ్చింది. ఒకదశలో 7-7తో సమంగా ఉన్న సింధు.. తర్వాత అనూహ్యంగా 10-18తో వెనకబడి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లో భారత షట్లర్ పుంజుకుని 8-5తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత వాంగ్ జి యిని పట్టువదలకుండా పోరాడి 15-15తో స్కోరుని సమం చేసింది. తర్వాత సింధు జోరు వరుసగా ఆరు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు ఆరంభంలో 7-3 ఆధిక్యం సాధించినప్పటికీ వాంగ్ పుంజుకుని స్కోరును 9-9తో సమం చేసింది. తర్వాత పోరు హోరాహోరీగా సాగింది. 16-16తో ఇద్దరూ సమంగా ఉన్న సమయంలో చైనా షట్లర్ గాయపడి నడవడానికి కూడా ఇబ్బందిపడింది. అయినా ఆటను కొనసాగించి 19-17తో ఆధిక్యంలో నిలిచింది. ఈ సమయంలో మళ్లీ గాయం నొప్పితో కిందపడిపోయింది. మళ్లీ లేచినిలబడి ఆటను కొనసాగించి నాలుగు పాయింట్ల వ్యత్యాసంతో విజయం సాధించింది. చైనా క్రీడాకారిణి పోరాట పటిమకు భారత ప్రేక్షకులు ఫిదా అయ్యారు.ఇక, మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకానికి అడుగుదూరంలో నిలిచింది. రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో భారత ద్వయం 21-16, 21-12తో రిన్ ఇవానాగా-నకనిషి (జపాన్)ను వరుస గేమ్‌ల్లో ఓడించింది. శుక్రవారం క్వార్టర్ ఫైనల్‌లో గాయత్రి జోడీ.. ప్రపంచ నంబర్ 4 జాంగ్ షుక్సియన్-జియా యిఫాన్ (చైనా)తో తలపడనుంది. భారత జోడీ ఆ పోరులో గెలిస్తే సెమీ ఫైనల్స్‌కు చేరుకుని కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంటుంది. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి ప్రిక్వార్టర్స్‌లో 19-21, 11-21తో ఇండోనేసియాకు చెందిన అల్వి ఫర్హాన్ చేతిలో ఓటమిచవిచూశాడు. మిక్స్‌డ్ డబుల్స్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో నిరాశపర్చారు. ఈ ద్వయం 16-21, 5-21తో చెన్ ఫాంగ్-గువో జిన్వా (చైనా) చేతిలో ఓటమిపాలైంది.

## శ్రీలంకతో రెండో టెస్టు.. సారాంశ్ జైన్ ఎంట్రీ ఖాయమే..!

**విశ్వంభర, స్పోర్ట్స్:** శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు ప్రారంభంకానుంది. గాలెలో గెలిచి ఊపుమీదున్న టీమ్‌ఇండియా కొలంబో వేదికగా జరిగే రెండో టెస్టులోనూ విజయం సాధించి లంకేయులను వైట్‌వాష్ చేయాలని భావిస్తోంది. లంక టూర్ కోసం తొలిసారి టెస్టు జట్టు నుంచి పిలుపు అందుకున్న ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్ కొలంబో టెస్టులో అరంగేట్రం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అతడు తుది జట్టులో చోటు దక్కించుకునేందుకు బలమైన అవకాశాలున్నాయని జట్టు వర్గాలు జాతీయ మీడియాకు తెలిపాయి. ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్‌ను ఆడిస్తే ఎడమ చేతివాటం స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌పై వేటు పడటం ఖాయం. గాలెలో అతడు 25 ఓవర్లు వేసి ఒకే వికెట్ పడగొట్టాడు. మరోవైపు, మానవ్ సుతార్, రవీంద్ర జడేజా సత్తాచాటారు. వారిద్దరిని తుది జట్టు నుంచి తప్పించే పరిస్థితి లేదు. ఈ లెక్కన చూసకుంటే కుల్‌దీప్ యాదవ్‌ను పక్కన పెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పైగా శ్రీలంక జట్టులో చాలా మంది ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారు. దీంతో ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్ వైపే టీమ్‌మేనేజ్‌మెంట్ మొగ్గుచూపే అవకాశాలున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ 33 ఏళ్ల వెటరన్ స్పిన్నర్ రెడ్‌బాల్ క్రికెట్‌లో అదరగొట్టి 11 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఇటీవల ఇండియా 'ఎ' శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇతను రెండో అనధికార టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.




## భారత్‌లోనే క్రేజ్ ఎక్కువ.. నాకు రెండో ఇల్లు లాంటిది

**విశ్వంభర, స్పోర్ట్స్:** భారతదేశంతో తనకు బలమైన అనుబంధం ఉందని, తనకు రెండో ఇల్లు లాంటిదని ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ పేర్కొన్నాడు. సిడ్నీలోని భారత కాన్సులేట్ నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో షేన్ వాట్సన్ పాల్గొని ప్రసంగించాడు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగమవడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తునని తెలిపాడు. ఆస్ట్రేలియా కంటే భారత్‌లోనే తనకు ఎక్కువ ఆదరణ లభించిందన్నాడు. తనకు 19 ఏళ్లు ఉన్నప్పుడు తొలిసారి భారత్‌లో పర్యటనకు వచ్చానని, అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఇండియా శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నాడు. శాకాహార వంటకాలు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నాడు. "ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం నాకెప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతినిస్తుంది. భారతీయ ప్రజలు నా జీవితం, వృత్తిపై అద్భుతమైన ప్రభావం చూపారు. వారితో నాకు బలమైన అనుబంధం ఉంది. భారత్ నాకు మరో ఇల్లు. ఇది చాలా ఆసక్తికరమైన విషయం. ఆస్ట్రేలియా తరపున సుదీర్ఘకాలం పాటు క్రికెట్ ఆడే అదృష్టం నాకు లభించింది. కానీ భారతదేశంలో నాకు ఎప్పుడూ ఎంతో ఆదరణ లభించేది. 2008లో ఐపీఎల్ ప్రారంభమైంది. నా కెరీర్‌లో కీలకమైన ఆ సమయంలో అద్భుతమైన ప్రదర్శనలు చేసే అవకాశం నాకు ఆ వేదిక ద్వారా దక్కింది. ఆస్ట్రేలియాతో పోలిస్తే భారత్‌లో క్రికెట్‌ను ప్రేమించే వారు చాలా ఎక్కువ మంది ఉన్నారు. కానీ, ఇండియాలో నన్నెప్పుడూ అంతగా విమర్శించలేదని నేను ఎప్పుడూ భావించేవాడిని. అక్కడ నాకు ఎక్కువ మద్దతు లభించేది. అదే ఆస్ట్రేలియాలోనైతే బాగా ఆడినప్పుడు ప్రశంసలు వచ్చేవి. ఒకవేళ బాగా ఆడకపోతే విమర్శలు ఎదురయ్యేవి" అని వాట్సన్ వివరించాడు.వాట్సన్ 2008 నుంచి 2020 వరకు ఐపీఎల్‌లో ఆడాడు. రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 145 మ్యాచ్‌లు ఆడి 3, 874 రన్స్ చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలున్నాయి. బౌలర్‌గా 92 వికెట్లు పడగొట్టాడు.



## తొలిసారి 40 ట్రిలియన్ డాలర్లు చేరిన అమెరికా అప్పు

**విశ్వంభర, బిజినెస్ బ్యూరో:** అమెరికా ఆర్థికవ్యవస్థపై అప్పుల భారం మునుపెన్నడూ లేనంత స్థాయికి చేరింది. ఆ దేశ జాతీయ అప్పు చరిత్రలోనే తొలిసారిగా 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటినట్లు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అధికారికంగా వెల్లడించింది. రాబడికి మించి విపరీతంగా పెరిగిపోతున్న ప్రభుత్వ ఖర్చులు, పన్ను కోతలు, వడ్డీ భారం వల్ల తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం వసూలు చేసే పన్నుల కంటే ఖర్చులే ఎక్కువగా ఉండటంతో ప్రతి ఏటా బడ్జెట్ లోటు పెరిగిపోతోంది. ప్రధానంగా వృద్ధాప్య జనాభా పెరగడం వల్ల సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ వంటి సంక్షేమ పథకాల వ్యయం విపరీతంగా పెరిగింది. దీనికి తోడు రక్షణ రంగానికి చేసే భారీ కేటాయింపులు, ట్రంప్ పాలనలోని పన్ను కోతల చట్టాలు ప్రభుత్వం వచ్చే ఆదాయాన్ని తగ్గించి, లోటును మరింత పెంచాయి. కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) అంచనా ప్రకారం, 2026 నాటికి అమెరికా బడ్జెట్ లోటు 1.9 ట్రిలియన్ డాలర్లకు చేరనుంది. ప్రస్తుతం పాత అప్పులు తీర్చడానికి, వడ్డీలు చెల్లించడానికే అమెరికా మళ్లీ కొత్తగా అప్పులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. 2026 మొదటి 10 నెలల్లోనే నికర వడ్డీ చెల్లింపులు 963 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది అమెరికా జాతీయ రక్షణ బడ్జెట్ కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ ఆధిపత్యం వల్ల ప్రస్తుతానికి నిలదొక్కుకుంటున్నప్పటికీ, పెరిగిన వడ్డీ రేట్ల వల్ల ప్రభుత్వం కొత్తగా రుణాలు సేకరించడం మరింత ఖరీదైన విషయంగా మారింది. ఇది అమెరికా వెంటనే డిఫాల్ట్ అవుతుందని అర్థం కాకపోయినా, రుణ భారం వేగంగా పెరిగితే పెట్టుబడిదారులు అధిక రాబడులు డిమాండ్ చేసి, ఆర్థిక వ్యవస్థపై రుణ భారాలను మోపే ప్రమాదముందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



## హాకీ ప్రపంచ కప్‌లో రెండో రౌండ్‌లో భారత్

**అమ్స్టెల్వీన్:** హాకీ ప్రపంచ కప్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరిగిన పూల్ డి మ్యాచ్‌ను భారత్ 0-0తో డ్రాగా ముగించింది. ఇంగ్లాండ్ క్రీడాకారిణులు గోల్స్ చేయడానికి గట్టిగా ప్రయత్నించినా.. భారత ప్లేయర్లు పట్టుదల ప్రదర్శించి గోల్స్ రాకుండా అడ్డుకున్నారు. ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో భారత్ ఐదు పాయింట్లతో రెండో రౌండ్‌కు అర్హత సాధించగా.. నాలుగు పాయింట్లతో ఉన్న ఇంగ్లాండ్ ఇంటిముఖం పట్టింది. పూల్ డి నుంచి భారత్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది.







## రెండో టెస్టుకు ముందే శ్రీలంకకు ఎదురుదెబ్బ.. ఆ ముగ్గురు బ్యాటర్లు ఔట్ !

**విశ్వంభర, స్పోర్ట్స్:** భారత జట్టు చేతిలో ఓడిపోయిన శ్రీలంకకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. మరో ముగ్గురు లంక ప్లేయర్లకు గాయం అయింది. ఇండియాతో ఈ నెల 23వ తేదీ రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ టెస్ట్ నేపథ్యంలో ముగ్గురు శ్రీలంక టాప్ ప్లేయర్లు దూరం అయ్యారు. గాయాల కారణంగా కుషాల్ మెండిస్, దినేష్ చండిమల్, నిస్సాంక రెండో టెస్ట్ కు అందుబాటులో ఉండబోరని కోచ్ గారీ క్రిస్టెన్ వెల్లడించారు. ఇప్పటికే ఫస్ట్ టెస్ట్ ఓడిన ప్లేయర్లు, శ్రీలంక రెండో టెస్ట్ లోనైనా గెలిచి సిరీస్ సమం చేయాలని భావిస్తోంది. అటు 2-0 తేడాతో శ్రీలంక పై వైట్ వాష్ సాధిస్తామని స్పష్టం చేసింది భారత్. అయితే ఇలాంటి నేపథ్యంలో శ్రీలంక ముగ్గురు కీలక ప్లేయర్లు దూరం కావడం మన భారత్ కు చాలా అనుకూలించే అంశమని వ్యాఖ్యానించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని రెండో టెస్టులో కూడా గెలవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు.

## ఒకే రోజులో రూ.4300 పెరుగుదల.. మూడు నెలల గరిష్ఠానికి బంగారం ధర



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. పసిడి ధర ఒకేరోజు దాదాపు రూ.4300 పెరిగింది. దీంతో దేశ రాజధానిలో 10 గ్రాముల బంగారం ధర రూ.1.62 లక్షలకు చేరుకుంది. ఈ స్థాయిలో పెరగడం మూడు నెలల్లో ఇదే గరిష్ఠం. మార్కెట్లో నిన్న బంగారం ధర సుమారు రూ.1.58 లక్షలుగా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు, వెండి సైతం కిలోకు రూ.10 వేలు పెరిగి రూ.2.45 లక్షలకు చేరింది. గత ఏడు వారాల్లో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. అంతర్జాతీయంగా చమురు మంటలు కొనసాగుతున్న వేళ అమెరికా డాలర్ విలువ పడిపోవడం.. యూఎస్ బాండ్లపై రాబడి తగ్గుతుండడంతో మదుపరులు లోహాల వైపు మొగ్గ చూపుతున్నట్లు మార్కెట్‌రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగి, బంగారం ధరలు పైపైకి పోతున్నట్లు చెబుతున్నారు.

## గోల్డ్ లోన్ రంగంలోకి ఆదిత్య బిర్లా కంపెనీ




**విశ్వంభర, బిజినెస్:** బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఆదిత్య బిర్లా క్యాపిటల్ బంగారం రుణాల వ్యాపారంలోకి అడుగుపెడుతోంది. రాబోయే 3 ఏళ్లలో మొత్తం 1,000 బంగారు రుణాల శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027 చివరి నాటికి తొలిదశలో భాగంగా 300 శాఖలు ప్రారంభిస్తామని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.దేశంలో బంగారు రుణాలు బలమైన వృద్ధిని నమోదుచేస్తున్నాయని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాకేశ్ సింగ్ తెలిపారు. వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా ఈ రంగంలోకి అడుగుపెడుతున్నట్టు తెలిపారు. పట్టణాల్లో, నగరాల్లో మార్కెట్‌ను విస్తరిస్తామని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫాం, రిటైల్ స్టోర్‌లలో బంగారు రుణాలు కొత్త వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని అన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా బంగారానికి డిమాండ్ పెరిగిందని, సురక్షిత పెట్టుబడిగానూ మారిందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అందుకే ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు బంగారు రుణాల వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నాయని అభిప్రాయపడ్డారు. బంగారు రుణాలను చెల్లించి తిరిగి బంగారాన్ని పొందొచ్చు అనే నమ్మకం రుణగ్రహీతల్లో పెరగడంతో గోల్డ్ లోన్‌లకు డిమాండ్ పెరిగిందని అన్నారు. జూన్ 2026 నాటికి ఎన్‌బీఎఫ్‌సీల బంగారు రుణాల పోర్ట్‌ఫోలియో 69.3 శాతం వృద్ధి పెరిగి రూ.3.42 లక్షల కోట్లకు చేరింది.

## లసానే డైమండ్ లీగ్‌కు నీరజ్ చోప్రా సిద్ధం

**విశ్వంభర, స్పోర్ట్స్:** గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకంతో మెరిసిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరో కీలక టోర్నమెంట్‌కు సిద్ధమయ్యాడు. ఆగస్టు 21, శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న 'లసానే డైమండ్ లీగ్' లో ఆయన బరిలోకి దిగనున్నారు. గతంలో ఈ వేదికపై అద్భుత రికార్డు కలిగి ఉన్న నీరజ్.. 2022, 2023 సంవత్సరాల్లో విజేతగా నిలవగా, 2024లో రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఈసారి కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నప్పటికీ, ఆయనకు బలమైన ప్రత్యర్థుల నుంచి తీవ్ర పోటీ ఎదురుకానుంది.ఇటీవల ముగిసిన కామన్వెల్త్ క్రీడల్లో నీరజ్ చోప్రా 85.83 మీటర్ల దూరం మాత్రమే ఈటెను విసిరి రజతం సాధించగా.. శ్రీలంక అథ్లెట్ రుమేశ్ థరంగ పతిరంగే ఏకంగా 89.75 మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే పాకిస్థాన్ స్టార్ అర్షద్ నదీమ్ సైతం ఈ టోర్నీలో గట్టి పోటీ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. వీరితో పాటు ట్రినిడాడ్ అండ్ టొబాగో అథ్లెట్ ఖెషోర్న్ వాల్కాట్, ఆండర్సన్ పీటర్స్ కూడా రేసులో ఉండటంతో పురుషుల జావెలిన్ పోటీ రసవత్తరంగా మారనుంది. ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలకు ముందు జరుగుతున్న ఈ లీగ్‌లో నీరజ్ ఏ మేరకు రాణిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.






అనుపమ పరమేశ్వరన్ ఇటీవల తన వ్యక్తిగత జీవితం, మాజీ ప్రియుడి వల్ల ఎదుర్కొన్న మానసిక క్షోభను బయటపెట్టిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఈ విషయంపై తాజాగా నటి అదితి శంకర్ స్పందించారు. అనుపమ ధైర్యాన్ని, నిజాయతీని ఆమె ప్రశంసించారు. అదితి నటించిన 'వన్స్‌మోర్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై మాట్లాడారు. ''అనుపమ ఇంటర్వ్యూ చూశాను. ఆమె కామెంట్స్‌పై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండొచ్చు. కానీ, ఆమె ఎదుర్కొన్న ఇబ్బందిని ధైర్యంగా పంచుకున్నందుకు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఆమె మాటల్లో నిజాయతీ ఉంది'' అని అదితి పేర్కొన్నారు. ఎవరినీ నిందించడం, కించపరచడం అనుపమ ఉద్దేశం కాదని అదితి అభిప్రాయపడ్డారు. ఆమె పంచుకున్న అనుభవం అవగాహన కలిగించేలా ఉందన్నారు. చాలామంది పురుషులు, మహిళలు తీవ్రమైన మానసిక ఘర్షణలతో కూడిన బంధాల్లో ఉంటున్నారని.. తాము ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నామో కూడా అర్థం చేసుకోలేకపోతున్నారని అదితి వివరించారు. అనుపమలా ఓపెన్‌గా మాట్లాడటం వల్ల అలాంటి వారికి కూడా ఒక స్పష్టత వస్తుందని తెలిపారు. మాజీ బాయ్‌ఫ్రెండ్ పేరును ప్రస్తావించకుండా అనుపమ తన వ్యక్తిగత జీవితంపై ఇటీవల మాట్లాడారు. అతడి ప్రవర్తన వల్ల ఒక నటిగా, మహిళగా తనను తాను నిందించుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల పాటు ఆ బంధంలో నరకం చూశానని చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్ అవుతుండగా అభిమానులు ఆమెకు ధైర్యం చెబుతూ పోస్టులు పెడుతున్నారు.

# అనుపమకు హ్యాట్సాఫ్ చెప్పాలి శంకర్ కుమార్తె అదితి ప్రశంసలు




## పర్సనల్ లైఫ్ కాదు.. పాలన గురించి మాట్లాడండి

తమిళనాడులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో సీఎం విజయ్‌కు.. నటి త్రిష సెల్యూట్ చేయడం తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ అంశం రాజకీయంగా దుమారం రేపగా.. నటి సంజన తాజాగా దీనిపై స్పందించారు. ధైర్యం ఉంటే విజయ్ పాలన గురించి మాట్లాడాలని అన్నారు. ఆయన విజయవంతమైన రాజకీయ ప్రయాణాన్ని ఓర్వలేకే.. కొందరు వ్యక్తిగత దాడికి దిగుతున్నారని సంజన విమర్శించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగా విజయ్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై సంజన ప్రశంసలు కురిపించారు. ప్రజా సమస్యలపై ఆయన త్వరితగతిన స్పందిస్తూ.. ఇతర రాష్ట్రాల ప్రజలను కూడా ఆకర్షిస్తున్నారని అన్నారు. ''విజయ్ రాష్ట్రాన్ని సమర్థంగా పరిపాలిస్తున్నారు కాబట్టి.. ఆయనపై ఆరోపణలు చేయలేకపోతున్నారు. వృత్తిపరంగా ఎలాంటి లోపాలు కనిపించనప్పుడు మాత్రమే వ్యక్తిగత ఎజెండాను వెతకడానికి ప్రయత్నిస్తారు. వారి పర్సనల్ లైఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కించపరచాలని చూస్తారు. విజయ్ విషయంలో ఇప్పుడు ఇదే జరుగుతోంది. కానీ మహిళలను లక్ష్యంగా చేసుకునే ఇలాంటి రాజకీయాలు ఎప్పటికీ ఆమోదయోగ్యం కావు'' అని సంజన పేర్కొన్నారు. ఇక త్రిష గురించి సంజన మాట్లాడుతూ.. ఆమె చాలా గొప్ప నటి అని తెలిపారు. సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు, గౌరవాన్ని సంపాదించుకున్నారని అన్నారు. విజయ్‌త్రిష మధ్య ఉన్న బంధం వారి వ్యక్తిగత విషయమని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా.. ఎదుటి వారి సాన్నిహిత్యాన్ని బట్టి వారి బంధం విషయంలో ఒక నిర్ణయానికి రావడాన్ని సంజన తప్పుపట్టారు.



## ఓటీటీ రిలీజ్‌కు సిద్ధమైన ప్రకాశ్ రాజ్ వెబ్ సిరీస్

వెర్సటైల్ యాక్టర్, టాలీవుడ్ సీనియర్ నటుడు ప్రకాష్‌రాజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వెబ్ సిరీస్ 'జగమే సంగీతం'. మెగాస్టార్ చిరంజీవి పెద్ద కుమార్తె సుస్మిత కొణిదెలకు చెందిన ప్రొడక్షన్ హౌస్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్‌పై రూపొందిన ఈ వెబ్‌సిరీస్ నుంచి ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్‌కు విశేష స్పందన లభించింది. ఇప్పుడు ఈ సిరీస్ విడుదల తేదీని ప్రకటించారు. ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోలో సెప్టెంబర్ 4వ తేదీ నుంచి తెలుగు, తమిళంలో విడుదల చేయనున్నట్లు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. కాగా.. 'కుమారి 21ఎఫ్', '18 పేజెస్' సినిమాల ఫేమ్, క్రియేటివ్ జీనియస్ సుకుమార్ శిష్యుడు సూర్య ప్రతాప్ పల్నాటి దర్శకత్వం వహించిన 'జగమే సంగీతం' సిరీస్ సంగీతం, మనుషుల మధ్య అనుబంధాల నేపథ్యంలో ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కించగా.. మ్యూజిక్ లవర్స్‌లో మంచి వైబ్ క్రియేట్ అవుతుంది.




## సూర్య పడిన కష్టాలన్నీ నాకు తెలుసు: రాధిక

తాజాగా 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో విజయాన్ని అందుకున్నారు నటుడు సూర్య. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో నటి రాధిక మాట్లాడుతూ సూర్యపై ప్రశంసలు కురిపించారు. ఆయన ఎన్నో మానసిక పోరాటాలు చేశారని.. వాటిని అధిగమించడం తాను దగ్గరనుంచి చూశానని చెప్పారు.విశ్వనాథ్ అండ్ సన్స్‌లో సూర్యకు తల్లి పాత్ర పోషించిన రాధిక.. ఈ చిత్రాన్ని ఆయన అంగీకరించారని తెలిసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. ''సూర్య పడిన కష్టాలను, బాధను నేను దగ్గర నుంచి చూశాను. అతడిని నా కుటుంబంలో ఓ భాగంగా భావిస్తాను. సినిమాల్లో చాలా మంది సవాళ్లను ఎదుర్కొన్నారు. కానీ, నిజమైన మానసిక పోరాటాలు మరో స్థాయిలో ఉంటాయి. సూర్య ఆ కష్టాలను అధిగమించాడు. ఇప్పుడు అతడిని చూస్తుంటే గర్వంగా అనిపిస్తుంది. సూర్య ఎక్కువగా మాట్లాడే వ్యక్తి కాదు. తన మనసులోని భావాలను చాలా అరుదుగా కొంతమందితో మాత్రమే పంచుకుంటాడు. అతడు ఎక్కువగా మాట్లాడే ఆ కొంతమందిలో సన్నిహితుల్లో నేను కూడా ఒకదాన్ని. అతడికి అప్పుడప్పుడు సలహాలు ఇస్తుంటా'' అని రాధిక చెప్పారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో రాధికతో ఉన్న అనుబంధం గురించి సూర్య కూడా మాట్లాడారు. కార్తి చదువుకోవడానికి అమెరికా వెళ్లేందుకు రాధిక ఆర్థిక సాయం చేశారని తెలిపారు. ఆమె చేసిన సాయాన్ని కుటుంబమంతా జీవితాంతం గుర్తు పెట్టుకుంటామన్నారు. ఇక వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' వసూళ్లతో దూసుకుపోతోంది. ఐదు రోజుల్లోనే ఈ సినిమా రూ.150కోట్లు వసూళ్లు చేసింది. ఇప్పటికే తమిళంలో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగానూ రికార్డు సృష్టించింది .

## దసరా బరిలో యామీ గౌతమ్..

బాలీవుడ్ బ్యూటీ యామీ గౌతమ్ గత ఏడాది చేసిన 'హక్' విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకోవడంతో పాటు పలు అవార్డులను కూడా రాబట్టింది. అదే జోష్‌తో ఆమె ఇటీవల 'ధురంధర్: ది రివెంజ్'లో కీలక పాత్రలో కనిపించి బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇక ఇప్పుడు ఆమె మరో విభిన్నమైన కథతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. బాలాజీ మోహన్ దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సూపర్‌న్యాచురల్ హారర్‌కామెడీ చిత్రం 'నయీ నవేలీ'. ఇందులో యామీ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్, కలర్ ఎల్లో సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మీరట్ నేపథ్యంలో సాగే ఈ కథలో, అల్లకల్లోలంగా ఉన్న ఒక కుటుంబంలోకి అడుగుపెట్టి అందరికీ సంతోషాన్ని పంచే పర్ఫెక్ట్ కోడలిగా యామీ కనిపిస్తారు. అయితే, ఆమె ప్రవర్తన చూసి బావకి అనుమానం వచ్చి, ఆమె ఒక చేతబడి చేసే మహిళ అని భావించడంతో అసలు కథ మొదలవుతుందని సమాచారం. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కాగా.. తాజాగా, ఈ చిత్రాన్ని దసరా పండగ కానుకగా అక్టోబర్ 16, 2026న దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. కామెడీ, ఫాంటసీ, అడ్వెంచర్ మేళవించిన పాత్రలో యామీ నటన సినిమాకే హైలైట్‌గా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ పాత్రకు యామీ గౌతమ్ మాత్రమే సరైన ఎంపిక అని నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ ప్రశంసించారు. ఈ కథకు కావాల్సిన అమాయకత్వం, కొంటెతనం రెండూ యామీలో మెండుగా ఉన్నాయని, తన పర్ఫార్మెన్స్‌తో సినిమాను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లారని అన్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌తో యామీ గౌతమ్ ఈ దసరాకి థియేటర్లలో అలరించబోతుండటం విశేషం.

## ఇది ఆరంభం మాత్రమే.. మున్ముందు చాలా ఉంది..

స్పెషల్ సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గా వరుస ఆఫర్లు అందుకుంటున్న టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. న్యూయార్క్‌లో జరిగిన ఓ ప్రత్యేక గాలా కార్యక్రమంలో ఆమెను సత్కరించారు. దీనికి సంబంధించిన ఫొటోలను పంచుకుంటూ.. 'న్యూయార్క్‌లో జరిగే గాలా కార్యక్రమానికి నేను సిద్ధం.. నన్ను గౌరవించిన న్యూయార్క్ నగర పబ్లిక్ అడ్వకేట్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సత్కారం నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. ఈ గౌరవం పట్ల నిర్వాహకులకు కృతజ్ఞతగా ఉంటాను. ఇంతటి ప్రేమను అందుకున్న తర్వాత మళ్లీ వర్క్ మోడ్‌లోకి వెళ్ళడానికి రెడీగా ఉన్నాను. ఇది ఆరంభం మాత్రమే. మున్ముందు చాలా ఉంది' అంటూ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా తెలిపింది పూజా హెగ్డే. కాగా.. ఈ హీరోయిన్ చేతిలో ప్రజెంట్ 'కాంచన 4', 'శ్రీ శ్రీ' వంటి సినిమాలు ఉన్నాయి.




## బిగ్‌బాస్‌లోకి బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ..

అత్యధిక ప్రేక్షకాదరణ పొందిన టెలివిజన్ రియాల్టీ షోలలో బిగ్‌బాస్ ఒకటి. ఇది వివిధ భాషల్లో కోట్లాది ప్రేక్షకులను అలరిస్తూ అత్యధిక టీఆర్పీ రేటింగ్‌తో దూసుకెళ్తుంది. ఇప్పటికే తెలుగుతో పాటు పలు భాషల్లో అగ్ని పరీక్ష టాస్క్ నడుస్తుండగా.. తాజాగా హిందీ బిగ్‌బాస్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఇప్పటికే 19 సీజన్లను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న బిగ్ బాస్ హిందీ తన 20వ సీజన్‌తో తిరిగి రావడానికి సిద్ధమవుతోంది. రాబోయే ఈ షో కోసం ఏర్పాట్లు జరుగుతుండగా.. హౌస్‌లోకి వెళ్లే కంటెస్టెంట్లకు సంబంధించి ఇప్పటికే పలువురు ప్రముఖుల పేర్లు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఇప్పుడు తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ షోలో పాల్గొనాల్సిందిగా బిగ్ బాస్ 20 బృందం బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ మౌనీ రాయ్‌ను సంప్రదించింది. ఆమెను షోలోకి తీసుకురావడానికి నిర్వాహకులు భారీ పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నారని తెలుస్తుండగా.. మరి మౌనీ రాయ్ ఈ ఆఫర్‌ను అంగీకరిస్తారా, తిరస్కరిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వైరల్ వార్తతో హిందీ బిగ్ బాస్ షోపై మౌనీ రాయ్ ఫ్యాన్స్‌లో ఉత్కంఠ నెలకొంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com